


అమరావతి సచివాలయంలో కలెక్టర్ల సదస్సు జరిగే సమావేశ మందిరం



తేమ శాతం పేరిట తకరారు.. సహకరించని అధికారులు.. మొండికేస్తున్న మిల్లర్లు.. చేను దాటని గింజలు.. రోడ్లపైనే ధాన్యం నిల్వలు.. అనుమతి కోసం అన్నదాతల నిరీక్షణ.. గోతాలు లేక, కాటా కూలీలు రాక అవస్థలు.. ఇదీ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితి. చివరి గింజ వరకు కొంటాం.. తేమ శాతంలో వెసులుబాటు ఇచ్చాం.. వ్యవసాయశాఖ మిల్లర్ల కోసం కాకుండా రైతుల కోసం పనిచేయాలి.. అని ప్రభుత్వం చెప్తున్నా క్షేత్రస్థాయిలో కొర్రీలతో కొనుగోళ్లు సక్రమంగా జరగడంలేదు. పంట పండించేందుకు.. దానిని ప్రకృతి అవాంతరాల నుంచి రక్షించేందుకు.. ఎంతగా రైతులు కష్టపడ్డారో అంతకు మించి విక్రయించేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది. ఓ పక్క వాయుగుండం కంటిపై కునుకు లేకుండా చేస్తుంటే ఆర్.ఎస్.కెలు, మిల్లుల చుట్టూ రైతులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. అయినా అధికారులు, మిల్లర్లు కనీసంగా కూడా కనికరించడంలేదు. చాలామంది గిట్టుబాటు ధర రాకపోయినా, వచ్చినరేటుకు చేలల్లోనే ధాన్యాన్ని తెగనమ్ముకుంటున్నారు.

కొనుగోళ్లకు.. కొర్రీలు



నరసరావుపేట : పొలంలోనే ధాన్యం

- తేమ శాతం పేరిట తకరారు
- అన్నదాతకు నో.. దళారులకు సై
- కొనసాగుతున్న ధాన్యం రైతుల కష్టాలు
- అనుమతి రాక పొలాలు, రోడ్లపైనే నిల్వలు
- గోతాలు లేక, కాటా కూలీలు రాక అవస్థలు
- చేసేదిలేక దళారులకు తెగనమ్ముకుంటున్న వైనం
- వ్యవసాయశాఖ విఫలం.. కొరవడిన మిల్లర్ల సహకారం
- బ్యాంకు గ్యారెంటీల నుంచి గన్నీ సంచుల వరకు గందరగోళం
- మరో రెండు వారాల్లో లక్ష్యం పూర్తి.. ఆ తర్వాత స్పష్టత కరువు
- పల్నాడులో 2 లక్షల టన్నుల దిగుబడి.. కొనుగోలు లక్ష్యం 5 వేల టన్నులే



చేలల్లోనే ఉన్న ధాన్యం బస్తాలు

నరసరావుపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దేనికీ వెనకాడకుండా ధాన్యం రైతుల కోసం కొనుగోళ్లలో అనేక మార్పులు చేసింది. అయితే అధికారుల నిర్లక్ష్యం.. కొరవడిన మిల్లర్ల సహకారంతో రైతులు ధాన్యం విక్రయించుకునేందుకు అనేక కష్టాలు పడాల్సి వస్తోంది. ఒకవైపు వాయుగుండం హెచ్చరికలతో అన్నదాత వణికిపోతున్నా అధికారుల్లో చలనం లేదన్న విమర్శలున్నాయి. రైతులు ధాన్యం అమ్ముకునేందుకు వా... అవసరమైన అన్ని ఏర్పాట్లు చెయ్యాలని పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖలను మంత్రి మనోహర్ ఆదేశించినా అధికారులు పట్టించుకోవడంలేదు. వాతావరణ పరిస్థితుల్లో ముమ్మరంగా వరి నూర్పిడులు జరుగుతున్నాయి. అయితే ఆ స్థాయిలో కొనుగోళ్లు జరగడంలేదు. ఈ ఏడాది ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని సంతోషంగా ఉన్నా రైతులను అమ్మకాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ధాన్యం కొనుగోలు లక్ష్యం పరిశీలిస్తే ముక్కుబడిగానే ఉన్నట్టు చెప్పవచ్చు. ఒక్క గుంటూరు జిల్లాలో మినహా బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఎక్కడా గోతాలు అందుబాటులో లేవు. అత్యధిక సాగు జరుగుతున్న బాపట్ల జిల్లాలో గోతాలు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని గుంటూరు జిల్లాలో 1.84 లక్షల ఎకరాల్లో వరి సాగైతే కేవలం 1.05 లక్షల గోతాలు మాత్రమే అందుబాటులో ఉంచారు. బాపట్ల జిల్లాలో 3.8 లక్షల ఎకరాల్లో వరి సాగవగా పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేసిన గోతాలు కేవలం 70 వేలు మాత్రమే. అదికూడా కొన్నామని లెక్కలు చూపటం మినహా రైతులకు అందుతున్నది అంతంతే. ఎదురుచూపులు చూడలేక చివరకు రైతులే ఒక్కో గోతానికి రూ.30 నుంచి రూ.35 వరకు ఖర్చుచేసి కొనుగోలు చేసుకోవాల్సి వచ్చింది. రవాణాకు వాహనాల పరిస్థితి సరేసరి. ముఠా కూలీల విషయంలో మిల్లర్లు, దళారులు కలసి దగా చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. కాటా కూలీలను రైతుల దగ్గరకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, దళారులు చెబితేనే వారు కదలడంలేదని చెబుతున్నారు. దళారులు కొనుగోలు చేస్తున్న ధాన్యం బస్తాల దగ్గరకు మాత్రం నిమిషాల్లో వెళ్లిపోతున్నారని, రాత్రివేళల్లోనూ కాటా వేసేస్తున్నారంటున్నారు. తాము అడిగితే ఖాళీ లేదని దాటవేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దగ్గరలోని రైస్ మిల్లుకే ధాన్యం తీసుకెళ్లొచ్చన్న పాలకుల మాటలు అమలు కావడంలేదు. దాదాపు 45 కిలోమీటర్ల దూరంలోని రైస్‌మిల్లులకు ధాన్యం తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడంతో రైతులు అల్లాడుతున్నారు. ప్రభుత్వం తేమ శాతం 17 వరకు పరిమితి పెడితే, కోస్తాలోని ఐదు జిల్లాల్లో దానిని 25 శాతానికి మినహాయింపు ఇచ్చింది. తేమ శాతాన్ని ఆర్.ఎస్.కెలు పరీక్షిస్తాయని, మిల్లులు చేయాల్సిన అవసరం లేదని

(మిగతా 8వ పేజీలో)

మిల్లర్ల రివర్స్ దోపిడీ

మిల్లర్లు రైతుల నుంచి ధాన్యం కొనాలంటే 75 కిలోల బస్తాకు ధాన్యం కేటగిరీని బట్టి రూ.1725 నుంచి రూ.1740 చెల్లించాలి. అదే దళారుల నుంచి కొన్న ధాన్యానికి అయితే రూ.1300 నుంచి రూ.1350 వరకు వెచ్చిస్తే సరిపోతుంది. అంటే ఎంత లేదన్నా గిట్టుబాటు ధరకు, మార్కెట్ ధరకు రూ.400 నుంచి రూ.450 వరకు బస్తా ధరలో వ్యత్యాసం ఉంటుంది. అదే తేమ సాకు చూపి కోత వేస్తే మరో రూ.200 వరకు అదనం. బ్యాక్ గ్యారెంటీ సాకుతో కొంతమంది మిల్లర్లు రైతుల నుంచి నేరుగా కొనకుండా, దళారుల ద్వారా వచ్చిన ధాన్యాన్ని కొంటున్నారని సమాచారం. ఆర్.ఎస్.కేల్లోని సిబ్బంది సహకారంతో దళారుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్మినట్లు చూపిస్తున్నారు. ఇందులో రైతులకు రావాల్సిన గిట్టుబాటు ధరను కూడా మిల్లర్లు దోచేస్తున్నారనేది ఆరోపణ.

దిగుబడిలో 2.5 శాతమే..

పల్నాడు జిల్లాలో 87,740 వేల ఎకరాల్లో వరిసాగు చేయగా సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే ఈ స్థాయిలో ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేయలేదు. కేవలం 5 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ మంగళవారం తెలిపారు. దిగుబడి అవుతున్న ధాన్యంలో 2.5 మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేయనున్నది.



కలెక్టర్ అరుణ్‌కుమార్

నివేదికలతో.. అమరావతికి

- మూడు రోజులుగా ముమ్మర కసరత్తు
- సచివాలయంలో నేడు, రేపు కలెక్టర్ల సదస్సు
- సమగ్ర వివరాలతో సదస్సుకు కలెక్టర్ అరుణ్‌కుమార్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు అవుతుంది. బుధ, గురువారాల్లో రాజధాని అమరావతి సచివాలయంలో జరగనున్న ఈ సదస్సులో వివిధ అంశాలపై చర్చలు, సమీక్షలు నిర్వహించనున్నారు. రెండో రోజు సాయంత్రం డీడీపీలపై ప్రజంటేషన్ జరగనుంది. కలెక్టర్లు సమర్పించే ప్రణాళికల్లో బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందినవి మాత్రమే కమిటీ ఎంపిక చేసి ప్రదర్శనకు అనుమతి ఇవ్వనుంది. ఆరు నెలల పాలనలో వివిధ విభాగల పనితీరును మదింపు చేయడంతో పాటు జిల్లాల సర్వతోముఖాభివృద్ధికి రచించాల్సిన ప్రణాళికలపై సీఎం అధ్యక్షతన సమగ్రంగా చర్చించనున్నారు. ఈ సదస్సులో పాల్గొనడానికి కలెక్టర్ అరుణ్‌కుమార్ సిద్ధమయ్యారు. ఈ సదస్సులో నివేదించాల్సిన అంశాలపై గడచిన మూడు రోజులుగా వివిధ విభాగాల అధికారులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమై సమగ్ర వివరాలను సేకరించారు. రెవెన్యూ సంబంధమైన అంశాలతో పాటు ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీల పరిష్కారం ఏ స్థాయిలో ఉంది, గత ప్రభుత్వంలో అసంపూర్తిగా వదిలేసిన పనులు తదితర వివరాలతో పూర్తి స్థాయిలో కలెక్టర్ సదస్సులో పాల్గొనబోతున్నారు. ఆరు నెలల కూటమి పాలన సాధించిన విజయాలు, కలెక్టర్ దృష్టికి వచ్చిన లోటుపాట్లపై చర్చ జరగనుం దనేది సమాచారం. వివిధ పనులు చేపట్టడానికి సమగ్ర నివేదికలు అందించి వాటికి నిధులు విడుదల చేయాలనే అభ్యర్థనను కూడా సీఎంకు కలెక్టర్ విన్నవించే అవకాశాలు ఉన్నాయి.

ప్రభుత్వంపైనే ఆశలు..

వైసీపీ పాలనలో జిల్లా అభివృద్ధిలో నీలినీడలు అలుముకున్నాయి. తాగు, సాగు నీటి అవసరాలు తీర్చే ప్రాజెక్టుల పనులు అటకెక్కాయి. నిధుల కేటాయింపులు లేవు. ప్రాధాన్యం కలిగిన తాగు, సాగు నీటి పథకాల పనులు సర్వే స్థాయి కూడా దాటలేదు. వరికపూడిశెల ఎత్తిపోతల పథకం నిర్మాణం కలగానే మిగిలింది. పల్నాడు కరువు పథకం పనుల ఊసేలేదు. బుగ్గవాగు రిజర్వాయర్ సామర్థ్యం పెంపు కాగితాలకే పరిమితమైంది. నీటి పథకాలకు పూర్తి స్థాయిలో నిధుల కేటాయింపులు జరగక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మునిసిపాలిటీల్లో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. పల్లెల్లో చేపట్టిన జలజీవన్ అమలులో జిల్లా రాష్ట్రంలోనే చిట్టచివరన నిలిచింది. ఆయా పథకాల పూర్తికి కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. గోదావరి పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా తొలిదశలో గోదావరి జలాలను కుడి కాలువకు తరలించేందుకు నాడు టీడీపీ ప్రభుత్వం పథకం రూపొందించగా దాని పేరు మార్చిన వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదు. మాచర్ల నియోజక వర్గానికి అత్యంత ప్రాధాన్యం కలిగిన వరికపూడిశెల ప్రాజెక్టు విషయంలోనే వైసీపీ హయాంలో పనులు అడుగుకూడా ముందుకు సాగలేదు. గురజాల నియోజకవర్గంలో తంగెడ, మాచవరం ఎత్తి పోతల పథకాలకు నిధుల కొరత వెంటాడుతోంది. గతంలో టీడీపీ ప్రభుత్వం బుగ్గవాగు అభివృద్ధికి రూ.202 కోట్లు మంజూరు చేసింది. బుగ్గవాగు సామర్థ్యాన్ని 3.5 టీఎంసీల నుంచి 7 టీఎంసీలకు పెంచుతామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించి చతికిల పడింది. బుగ్గవాగు సామర్థ్యం పెంపుపైనే తాగు నీటి పథకాల అభివృద్ధి ఆధారపడి ఉంది.



గురజాల రెవెన్యూ డివిజన్ కార్యాలయం



ఆర్డీవో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

దోచేశారా.. దాచేశారా?

- ఆర్డీవో కార్యాలయంలో రూ.10 లక్షల ఫర్నీచర్ మాయం
- టీడీపీ హయాంలో ఏర్పాటు.. వైసీపీ హయాంలో మాయం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన యరపతినేని ?

గురజాలటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నూతన హంగులతో సర్వాంగ సుందరంగా గురజాల రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తీర్చిదిద్దారు. అయితే వైసీపీ హయాంలో కార్యాలయంలోని సుమారు రూ.10 లక్షలకు పైగా ఫర్నీచర్‌ను మాయం చేసేశారు. గురజాల డివిజన్ పరిధిలోని ప్రజలకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రూ.2.80 కోట్లతో కార్యాలయ నూతన భవనం నిర్మించారు. సమావేశాలు నిర్వహించుకునేందుకు, ఇతరత్రా కార్యాలయ అవసరాల మేరకు సుమారు రూ.10 లక్షలకు మేర ఫర్నీచర్ కూడా ఏర్పాటు చేశారు. అయితే తాజాగా పట్టణంలోని శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల ఏర్పాట్లపై ఈ నెల 7న రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఎమ్మెల్యే యరపతినేని అధికారులతో సమీక్షించారు. సమావేశం అనంతరం కార్యాలయాన్ని పరిశీలించగా గతంలో తన హయాంలో ఏర్పాటు చేసిన ఫర్నీచర్ కనిపించక పోవడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశా రు. దీనిపై అధికారులను ప్రశ్నించినా సరైన సమాధానం రాలేదని తెలుస్తోంది. కాగా ఈ విషయంపై ఎమ్మెల్యే యరపతినేని కలెక్టర్ అరుణ్‌బాబుకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫర్నీచర్ మాయంపై ఆర్డీవో మురళీకృష్ణను వివరణ కోరగా.. తాను ఇటీవలే విధుల్లో చేరానని చెప్పారు. కాగా వైసీపీ హయాంలోనే ఫర్నీచర్ మాయమైనట్లు తెలుస్తోంది.

ఇక అమరావతి పరుగులు

- పనులకు సీఆర్‌డీఏ అథారిటీ ఆమోదం
- 20 పనులకు రూ.11,467 కోట్లు కేటాయింపు
- రాజధానిలో ఆగిపోయిన హ్యాపీనెస్టుకూ మోక్షం
- ఏడీబీ, ప్రపంచ బ్యాంకుల నుంచి భారీగా నిధులు



గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏడీబీ, ప్రపంచ బ్యాంకుల నుంచి భారీగా నిధులు.. కూటమి ప్రభుత్వ పట్టుదల.. సీఆర్‌డీఏ అథారిటీ ప్రత్యేక దృష్టి నేపథ్యంలో రాజధాని అమరావతిలో పనులు పరుగులు తీయనున్నాయి. సీఆర్డీఏ ఈ నెల 2న సిద్ధం చేసిన ప్రతిపాదనలకు ఆ మరుసటి రోజు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ క్రమంలో గతంలో ఆగిపోయిన పనుల పునరుద్ధరణకు మంగళవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు జీవో 968ను కూడా జారీ చేసింది. ఏపీసీఆర్డీఏ ప్రతిపాదించిన 20 రకాల పనులకు రూ.11,467 కోట్లు కేటాయించింది. గతంలో ఆయా పనులకు సంబంధించి టెండర్ల కాలపరిమితి తీరిపోగా పనులను పునఃప్రారంభించడానికి కూటమి ప్రభుత్వం తాజాగా ఆమోద ముద్ర వేసింది.

రాజధానిలో పనుల సందడి..

గత టీడీపీ ప్రభుత్వం వేల ఎకరాల భూములు సేకరించి రూ.10 వేల కోట్లతో అనేక ప్రభుత్వ భవనాలను, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలను రాజధానిలో నిర్మించింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ అమరావతిని శ్మశానంగా మార్చే ఉద్దేశంతో పనులను నిలిపేసింది. దీంతో రాజధాని పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. కాగా ఆరు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ప్రమాణ స్వీకారానికి ముందే రాజధాని పునర్నిర్మాణంపై దృష్టి పెట్టింది. తొలుత రూ.36.5 కోట్లతో 29 గ్రామాల్లోని 24 వేల ఎకరాల్లో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టింది. 2014- 19లోనే తుది దశకు చేరిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ భవనాలు, ఆలిండియా సర్వీస్ ఉద్యోగుల భవనాలు మొదలు, గెజిటెడ్ ఉద్యోగుల భవనాలు, క్లాస్- 4 ఉద్యోగుల అపార్ట్‌మెంట్ల నిర్మాణ పనులు సహా మొత్తం 20 రకాల పనులు తక్షణం ప్రారంభం కానున్నాయి. రూ.594.54 కోట్లతో భవనాలను పూర్తి చేయడంతోపాటు, మరో రూ.226.26 కోట్లతో తాగునీరు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, వీధి దీపాలు, అంతర్గత రహదారులు, భవన సంరక్షణ తదితర సదుపాయాలు కల్పించనున్నారు. రూ.594.36 కోట్లతో నాన్ గెజిటెడ్ అధికారుల టవర్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, రూ.516.6 కోట్లతో ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల నివాసాలు, న్యాయమూర్తుల భవనాల నిర్మాణ పనులు చేపట్టనున్నారు.

లే అవుట్ల అభివృద్ధికి రూ.3,859.66 కోట్లు

భూ సమీకరణ(ఎల్‌పీఎస్) విధానంలో భూములిచ్చిన రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్ల లేఅవుట్ల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. తొలివిడతగా 8,496.3 ఎకరాల్లో ప్లాట్ల అభివృద్ధి, రహదారుల నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి, మంచినీటి సరఫరా, వరద నీరు, మురుగునీరు పారుదల, విద్యుత్, ఐటీసీ కేబుళ్లు, రోడ్ల వెంట వాకింగ్ ట్రాకులు, సైక్లింగు ట్రాకులను రూ.3,859.66 కోట్లతో నిర్మించనున్నారు. రూ.1,585 కోట్లతో కొండవీటి వాగు, పాలవాగు వెడల్పు, శాఖమూరు, నీరుకొండ వద్ద రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. రూ.984కోట్లతో హ్యాపీనెస్ట్ ప్రాజక్టు కింద నిర్మించనున్న 12 టవర్లతో 1200 అపార్ట్‌మెంట్లు నిర్మించనున్నారు.

అక్రమాలపై ఆరా

- జగనన్న కాలనీల భూసేకరణపై మండలాల వారీగా నివేదికలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలలో అక్రమాలపై కూటమి ప్రభుత్వం ఆరా తీస్తోంది. మండలాల వారీగా వివరాలు సేకరిస్తుంది. కాలనీల ఏర్పాటుకు భూసేకరణలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. కాలనీల మెరక, రహదారులకు గ్రావెల్ వినియోగం అంశాలపై కూడా దృష్టి సారించారు. జిల్లాలోని తహసీల్దార్‌లను కాలనీల పనులకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులు కోరారు. దీంతో మండలాల వారీగా నివేదికలు రూపొందిస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో జిల్లా వ్యాప్తంగా 224 కాలనీల లేఅవుట్‌లను ఏర్పాటు చేశారు. వీటిలో 36,626 గృహాలు మంజూరు చేశారు. కాలనీల్లో మెరక, రహదారుల ఏర్పాటునకు గ్రావెల్ వినియోగించారు. ఈ పనులు ఉపాధి హామీ పథకం కింద చేపట్టారు. మెరక పనుల్లో పెద్దఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలున్నాయి. కొన్ని చోట్ల మెరక తోలకుండానే బిల్లులు డ్రా చేశారన్న విమర్శలున్నాయి. కాలనీల ఏర్పాటుకు వందలాది ఎకరాల భూసేకరణ జరిగింది. వైసీపీ నేతలు రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి, అధిక ధరలకు ప్రభుత్వానికి ఇచ్చినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. కొందరు అధికారుల సహకారంతోనే భూసేకరణలో పెద్దఎత్తున వైసీపీ నేతలు ప్రభుత్వ నిధులను కొట్టేశారని తెలుస్తోంది. వినుకొండ ప్రాంతంలో వంద ఎకరాల భూ సేకరణలో భారీగా అవకతవకలు జరిగినట్టు ప్రాథమికంగా అధికారులు నిర్ధారించారు. ఎకరం భూమి రూ. 10 లక్షలకు కొనుగోలు చేసి రూ 25 లక్షలకు ప్రభుత్వానికి అప్పగించారన్న అభియోగాలు ఉన్నాయి. కాలనీల భూసేకరణ, రహదారులు, మెరక పనులకు సంబంధించి కాలనీల వారీగా ప్రభుత్వం జిల్లా అధికారులను వివరాలు కోరింది.



నరసరావుపేటలోని ఉప్పలపాడు వద్ద ఉన్న జగనన్న కాలని

రాష్ట్రపతి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

● సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్



సీఎస్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, జేసీ, డీఆర్‌వో

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ప్రథమ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము డిసెంబరు 17న ఇక్కడికి రానున్నారు. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించి విస్తృతమైన ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళ వారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన ఎయిమ్స్‌లో రాష్ట్రపతి పర్య టనకు సంబంధించిన ఏర్పాట్లపై ఎయిమ్స్, వైద్య ఆరోగ్య శాఖ, కృష్ణా-గుంటూరు, ఎన్‌టీఆర్ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. 17వ తేదీ ఉదయం 11.20 గంటలకు భారత వాయుసేన విమానంలో గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి రాష్ట్రపతి చేర ుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి మధ్యాహ్నం 12.05 గంటలకు మంగళగిరి ఎయిమ్స్‌లో జరిగే స్నాతకోత్సవంలో పాల్గొంటారు. అనంతరం గన్నవరం విమానాశ్రయం నుంచి తిరిగి ప్రయాణం అవుతారని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి హాజరయ్యారు.



విద్యుత్‌శాఖ ఉద్యోగులకు ఇకపై ముఖ హాజరు

● తొలిగా సర్కిల్ కార్యాలయంలో అమలు
● విడతల వారీగా డివిజన్, సెక్షన్ కార్యాలయాల్లో
● యాప్ డౌన్‌లోడ్‌కు ఉన్నతాధికారుల ఆదేశాలు

గుంటూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో ఉద్యోగులకు ఇకపై ముఖ ఆధారిత హాజరు (ఫేస్ రికగ్నేషన్ అటెండెన్స్ (ఎఫ్ఆర్ఏ)) విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నారు. విద్యుత్ శాఖలో ప్రవేశపెడుతున్న ఈ సరికొత్త విధానాన్ని తొలిగా సర్కిల్ కార్యాలయంలో అమల్లోకి తీసుకొచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో ఎఫ్ఆర్ఏ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. గుంటూరు సర్కిల్ కార్యాలయం విద్యుత్ భవన్‌లో ఉద్యోగులు సదరు యాప్‌ను తమ మొబైల్స్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని ఉన్న తాధికారుల నుంచి ఆదేశాలు అందాయి. కాగా, జనవరి 1 నుంచి పూర్తి స్థాయిలో ఎఫ్ఆర్ఏ అమల్లోకి తీసుకురానున్నట్లు విద్యుత్‌శాఖ వర్గాలు స్పష్టం చేశాయి. గుంటూరు, సీఆర్‌డీఏ, పల్నాడు, బాపట్ల సర్కిల్ కార్యాలయాల ఉద్యోగులకు దీనిని తొలిసారి అమలు చేయనున్నారు. సర్కిల్ కార్యాలయంలో ఎఫ్ఆర్ఏ అమల్లోకి వచిచన తర్వాత విడతల వారీగా డివిజన్, సెక్షన్ కార్యా లయాల్లోనూ అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమా చారం. ఇప్పటికే సచివాలయ ఉద్యోగులకు ఫేస్ అటెండెన్స్ విధానాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇదే తరహాలో విద్యుత్ ఉద్యోగులకూ ఈ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక ప్రభుత్వ కార్యాలయల్లో సమయ పాలన పాటించడంతో పాటు పనిలో వేగం పుంజుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎప్పుడూ పరిపాలనలో పారదర్శకత, పనిలో వేగంపై ప్రత్యేక దృష్టి సారించే సీఎం చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ శాఖలో కూడా ఈ సరికొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ విధానం ద్వారా ఉద్యోగులు సమయపాలన పాటించడంతో పాటు కార్యా లయాల్లో పనిలో కూడా వేగం పుంజుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

కిష్కిందపాలెంలో కీచక ఉపాధ్యాయుడికి దేహశుద్ధి



ఉపాధ్యాయులను విచారణ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

కొల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువు అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం, బాపట్ల జిల్లా కొల్లూరు మండల పరిధిలోని ఒక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపా ధ్యాయుడు వల్లభనేని వెంకటేశ్వరరావు విధులు నిర్వహిస్తున్నాడు. గత 20 రోజులుగా ఆ ఉపాధ్యాయుడు 6, 7 తరగతి విద్యా ర్థినులతో అస భ్యంగా ప్రవర్తించారని ఆరోపించారు. ఏడుగురు విద్యా ర్థినులతో వెకిలి చేష్టలకు పాల్పడుతున్న విషయాన్ని బాధిత విద్యా ర్థినులు అదే పాఠశాలలో పని చేస్తున్న మరో ఉపాధ్యాయుడుకి తెలియజేశారు. ఇటువంటి అకృత్యాల్యకు పాల్పడవద్దని ఆ ఉపాధ్యాయుడికి వారు చెప్పినా ఆయన ప్రవర్తనలో మార్పు రాలేదు. సోమ, మంగళవారాల్లో మరో ఇద్దరు విద్యార్థినుల తోనూ ఆ ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని వారు తమ తల్లిదండ్రులకు చెప్పారు. దీంతో, మంగళవారం ఉదయం పాఠశాలకు పెద్ద ఎత్తున తరలివచ్చిన విద్యార్థినుల తల్లిదండ్రులు ఆ ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. ఈ దాడితో ఆ ఉపాధ్యాయుడు సొమ్మసిల్లి పడిపోవడంతో గమనించిన మిగిలిన ఉపాధ్యాయులు వారి నుంచి ఆయనను రక్షించి, పోలీసులకు, గ్రామ పెద్దలకు ఈ సమాచారం అందించారు. ఎస్ఐ ఏడుకొండలు, భట్టిప్రోలు ఎస్ఐ శివయ్య ఈ పాఠశాలకు చేరుకుని విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆ ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకుని భట్టిప్రోలు స్టేషన్‌కు తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మంగళవారం సాయంత్రం రేపల్లె డీఎస్పీ ఏ శ్రీనివాసరావు కిష్కిందపాలెం చేరుకుని పాఠశాలలోని ఉపాధ్యాయులతో చర్చించారు. ఉపాధ్యాయుడిపై దాడి విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారి వీ జ్యోతి పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులను, విద్యార్థినులను విచారణ చేశారు. ఈ సంఘటనపై నివేదిక రూపొందించి జిల్లా విద్యా శాఖాధికారికి అందజేయనున్నట్లు ఎంఈవో తెలిపారు.

మోర్జంపాడులో 3.50 లక్షల నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో బీరువాను పరిశీలిస్తున్న సీఐ భాస్కరరావు, ఎస్ఐ సతీశ్ తదితరులు

మాచవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోర్జంపాడులో పట్టపగలే దోపిడీ జరిగింది. రైతు లక్ష్మారెడ్డి ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.3.50 లక్షల నగదు అపహరణకు గురైంది. ఎస్ఐ సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం, మోర్జంపాడుకి చెందిన యారం నరసింహారెడ్డి తన బంధువు రూ 3.50 లక్షల నగదును శనివారం రాత్రి లక్ష్మారెడ్డికి ఇవ్వడంతో ఈ నగదును బీరువాలో భద్రపరిచాడు. ఈ మొత్తం సొమ్మును సోమవారం బ్యాంకు ఖాతాలో వేయాలని అనుకున్నాడు. అయితే, సోమవారం ఉదయం 8 గంటలకే త్రీఫేజ్ విద్యుత్ సరఫరా రావడంతో రైతు లక్ష్మారెడ్డి హడావుడిగా తన పొలానికి నీరు పెట్టేందుకు వెళ్ళిపోయాడు. అనంతరం లక్ష్మారెడ్డి భార్య తమ పిల్లలను పాఠశాలకు పంపించి తాను కూడా పొలం వెళ్ళింది. గుర్తుతెలియని వ్యక్తులు లక్ష్మారెడ్డి ఇంటి తలుపు తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువా తలుపులు పగలగొట్టి అందులో ఉన్న రూ 3.50 లక్షల నగదును అపహరించుకు పోయారు. సాయంత్రం ఇంటికి వచ్చిన లక్ష్మారెడ్డి, తలుపులు తెరిచి ఉండటం చూసి ఆశ్చర్యపోయాడు. బీరువా తలుపులు తెరిచి ఉండటం, అందులో నగదు లేకపోవడంతో చోరీ జరిగినట్టు భావించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న దాచేపల్లి సీఐ భాస్కరరావు, మాచవరం ఎస్ఐ సతీష్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. క్లూస్ టీమ్ కూడా పరిశీలించి వేలి ముద్రలు సేకరించారు. బాధితుడు లక్ష్మారెడ్డి ఫిర్యాదు మేరకు సోమవారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

విజ్ఞాన్ వర్సిటీ వీసీకి గౌరవ కల్నల్ ర్యాంక్



గౌరవ కల్నల్ సర్టిఫికెట్ అందుకుంటున్న పీ నాగభూషణ్

గుంటూరు(విద్య),డిసెంబరు 10: చేబ్రోలు మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్‌కు ఎన్‌సీసీ విభాగంలో గౌరవ కల్నల్ ర్యాంక్‌ను మంగళ వారం అందుకున్నారు. న్యూఢిల్లీలోని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ వారు ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను, గెజిట్ నోటిఫికేషన్‌ను ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఎన్‌సీసీ డైరెక్టరేట్ డెప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమోడర్ వీ. మధుసూదన్ రెడ్డి విజ్ఞాన్ యూనివర్సిటీకి విచ్చేసి నాగ భూషణ్‌కు ఈ ర్యాంక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ విజ్ఞాన్స్ యూనివర్సిటీ అకడమిక్ ఫ్రేమ్‌వర్క్‌లో ఎన్‌సీసీను సమగ్ర అభివృద్ధి కోసం చేస్తున్న కృషికి గాను గౌరవ కల్నల్ ర్యాం క్‌ను అందించినట్లు వివరించారు. నాగ భూషణ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ విభాగంలో గౌరవ కల్నల్ ర్యాంక్ తనలభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ ర్యాంక్ లభించడం వలన ఎన్‌సీసీ కార్యకలాపాలను నిర్వహించడంలో తన బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. కల్నల్ సంజయ్ గుప్త, గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్ఎం. చంద్రశేఖర్, ఇతర గ్రూప్ కమాండర్లు, బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్లు, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

దినసరి ఉద్యోగుల సంఘం నూతన కమిటీ ఏకగ్రీవం

పెదకాకాని, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ దినసరి వేతన ఉద్యోగుల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. వికాస అధ్యక్షుడు నీలపు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి జవ్వాజి శ్రీనివాసరావు, సభ్యుల సమక్షంలో మంగళవారం ఈ ఎన్నిక జరిగింది.

రేపు పెన్షన్ అదాలత్

గుంటూరు(విద్య),డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న గుంటూరు,కృష్ణ,ప్రకాశం జిల్లాల్లోని భవిష్యనిధి పెన్షనర్ల కోసం పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ మాధవశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి నేరుగా పెన్షన్‌దారులు హాజరై సమస్యలు తెలియజేయవచ్చని తెలిపారు. కార్యాలయానికి రాలేని వారు ro.guntur@epfindia.gov.in మెయిల్ లేదా 94946 57469 వాట్సప్ నంబర్ లేదా 0863-2344106, 0863-2232921 ల్యాండ్‌లైన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పట్టభద్రుల దరఖాస్తుల తుది గణాంకాల విడుదల

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఓటరు నమోదుకు సం బంధించి దరఖాస్తులు, క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ పూర్తి అయింది. సోమవారం అర్ధరాత్రి వరకు దరఖాస్తులను ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్‌లో జిల్లా ఎన్నికల అధికారులు స్వీకరించారు. ముసాయిదా ఓటర్ల జాబితాల ప్రచురణ అనంతరం కొత్తగా ఆరు జిల్లాలు గుంటూరు, ఎన్‌టీఆర్, బాపట్ల, పల్నాడు, కృష్ణ, ఏలూరు నుంచి ఓటరు నమోదు కోసం 64,387 దరఖాస్తులు అందినట్లు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. అలానే ముసా యిదా జాబితాలో చేర్చిన ఓట్లలో 2341పై అభ్యంతరాలు ఫారం-7 ద్వారా అందాయి. ఓటరు చిరునామా మార్పు కోసం ఫారం-8 ద్వారా 1225 దాఖలు అయ్యాయి. మొత్తంగా 67953 క్లెయిమ్‌లు/ అభ్యంతరాలు/దరఖాస్తులు అందాయని ఈఆర్‌వో వివరించారు. వీటిని నిర్ణీత గడువు తేదీ లోపు పరిష్కరించి నెలాఖరుకు తుది ఓటర్ల జాబితాలను విడుదల చేస్తామని చెప్పారు.

వీఆర్‌కి 9 మంది కానిస్టేబుళ్లు

పొన్నూరుటౌన్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన 9 మంది కానిస్టేబుళ్లను పోలీస్ ఉన్నతాధికారులు వీఆర్‌కు బదిలీ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంగళగిరిలోని సీకే కన్వెషన్ హాల్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు వచ్చిన సందర్భంగా పొన్నూరు అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన 9 మంది సిబ్బంది ట్రాఫిక్ విధుల్లో ఉన్నారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ ట్రాఫిక్‌లో చిక్కుకుని కొంచెం సేపు నిలిచిపోయింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీస్ ఉన్నతాధికారులు దర్యాప్తు జరిపి, అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది పొన్నూరు పోలీస్‌స్టేషన్‌కు చెందిన వారిగా గుర్తించారు. దీంతో, విధుల్లో ఉన్న ఆ తొమ్మిది మందిని ఈ నెల 5న వీఆర్‌కు బదిలీ చేసినట్లు సమాచారం. ప్రస్తుతంఅర్బన్ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. 9 మంది వీఆర్‌కు బదిలీ కావడంతో అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు ఈ కొరత మరింత పెరిగిందని ఉన్నతాధికారులకు పోలీస్ అధికారులు సమాచారం ఇచ్చారు.

బాలికపై యువకుల అత్యాచారం

● నిందితులపై 'పోక్సో' కింద కేసు నమోదు

కొల్లూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బాలికపై యువకులు అత్యాచారానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మంగళవారం ఎస్ఐ ఏడుకొండలు తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని ఒక గ్రామానికి చెందిన 17 ఏళ్ల మైనర్ బాలిక పదో తరగతి మధ్యలో ఆపి వేసి కొల్లూరులోని ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తోంది. వస్త్రాల కొనుగోలుకు వచ్చిన ఆవులవారిపాలెం క్రీస్తులంకకు చెందిన విప్పర్ల ప్రేమ్‌కుమార్ అలియాస్ విక్కీ అనే యువకుడితో ఆ బాలికకు పరిచయం ఏర్పడింది. గత నెల 26 రాత్రి మైనర్ బాలిక తన గ్రామం వెళ్లేందుకు కొల్లూరు బజారులో వేచి ఉండగా అటువైపు వెళుతున్న యువకుడు, ఇక్కడ ఉన్నావు ఏంటని ప్రశ్నించాడు. ఇంటికి వెళ్లేందుకని ఆమె సమాధానం చెప్పింది. ద్విచక్ర వాహనంపై ఇంటి వద్ద వదిలి పెడతానని చెప్పడంతో నమ్మిన బాలిక ద్విచక్ర వాహనంపై అతనితో వెళ్లింది. తన గ్రామం తీసుకు వెళ్లకుండా దోనేపూడి కరకట్ట వైపు తీసుకు వెళ్లడంతో ఇదేమని ప్రశ్నించగా జవాబు ఇవ్వకుండా నిర్జన ప్రదేశానికి తీసుకువెళ్లి ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం తన స్నేహితుడు బెజ్జం శ్యాంబాబు కూడా రావడంతో ఆ యువకుడు కూడా అఘాయిత్యం చేశాడు. ఇన్ని రోజులు భయాందోళనలకు గురైన బాధితురాలు ఈ విషయం చెప్పలేదు. మంగళవారం కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో పోలీసులను ఆశ్రయించిన బాలిక, జరిగిన విషయాన్ని వివరించింది. దీనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు. నిందితులు ఇరువురు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

13న వర్సిటీలో జాతీయ సదస్సు

పెదకాకాని, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డిపార్టుమెంట్ ఆఫ్ ఈఐటీ ఆధ్వర్యంలో ఈ నెల 13న జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్, విభాగాధిపతి ఆచార్య సంధ్యాకోలే మంగళవారం తెలిపారు. ఈ సదస్సును డైక్‌మన్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'ద రోల్ ఆఫ్ ఎంబెడెడ్ సిస్టమ్స్ ఇన్ ఇన్‌స్ట్రుమెంటేషన్' అనే అంశంపై సదస్సు జరుగుతుందని తెలిపారు.

20న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

పెదకాకాని, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డీన్ ఆచార్య ఆర్ శివ రాం ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా సదస్సు బ్రోచర్‌ను ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే. గంగాధరరావ మంగళవారం ఆవిష్కరించారు. ఏఎన్‌యూలోని కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, ద అసోసియేషన్ ఆఫ్ చార్టెడ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్ (ఏసీసీఏ)లు సంయుక్తంగా ఈ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు అభినందన సభ

పెదకాకాని, డిసెంబరు 10(ఆంధ్ర జ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పీజీ సెట్ ద్వారా ప్రతి డిపార్టుమెంట్‌లో మొదటి రెండు ర్యాంకులు వచ్చిన విద్యార్థులకు బుధవారం అభినందన సభ నిర్వహిస్తున్నట్లు స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు రూపస్, నవిత పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు కామర్స్ విభాగంలోని సెమినార్ హాల్‌లో జరుగుతుందని తెలపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	98.107.118
చికెన్ విత్ స్కిన్	190.00
చికెన్ స్కిన్ లెస్	200.00

48,739 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 51,699 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 48,739 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 40,624 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14500	334	7500	13500
నెంబరు. 5	8000	13000	నెంబరు.5	8500	11500
273	9500	11300	273	10500	12500
341	8000	13000	341	7500	13000
4884	9500	11000	4884	10000	12500
సూపర్ 10	-	-	సూపర్ 10	8000	12000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8500	16500	తేజ	7500	16300
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	7500	12000
దేవనూరు డీలక్స్	8000	14500	దేవనూరు డీలక్స్	10000	12000
తెల్లకాయలు	4000	10000	తెల్లకాయలు	4000	9000

జంగమహేశ్వరపాడు నాటుబాంబుల కేసులో

పోలీసుల అదుపులో వైసీపీ నేత శ్రీనునాయక్



శ్రీను నాయక్ (ఫైల్)

దుర్గి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకిరాలకు చెందిన వైసీపీ నేత రమావత్ శ్రీనునాయక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాచర్ల పట్టణంలోని కోర్టులో మంగళవారం లొంగిపోయేందుకు వచ్చిన శ్రీనునాయక్‌ను అప్పటికే ముం దస్తు సమాచారంతో కాపుకాచి ఉన్న దుర్గి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని దుర్గి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఏడాది మే 8న ఎన్నికల సమయంలో జంగమహేశ్వరపాడులో పోలీసులు నాటుబాంబులు, వేట కొడవళ్లను గుర్తించారు. కాగా, జూలై 7న అదే గ్రామంలో నాటుబాంబు పేలడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆయా కేసులలో శ్రీనునాయక్ నిందితుడిగా ఉన్నాడు. అయితే ఈ కేసుల్లో ప్రధాన నిందితునిగా ఉన్న వైసీపీ నేత మన్నెయ్య గత నెల 29వ తేదీన మాచర్ల పట్టణంలోని కోర్టులో లొంగిపోగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. కాగా మన్నెయ్యకు శ్రీనునాయక్ ప్రధాన అనుచరుడు.

జిల్లా స్థాయికి ఇద్దరు క్రీడాకారుల ఎంపిక

అచ్చంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు జిల్లా స్థాయి రగ్బీ క్రీడలకు ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయిని డాక్టర్ ఆలపాటి సుజాత మంగళవారం తెలిపారు. నరసరావుపేటలో జరిగిన జిల్లా స్థాయి రగ్బీ క్రీడాకారుల ఎంపికలో ఉన్నత పాఠశాలకు చెందిన సందెపోగు లీలాక్షి, రామావత్ జయప్రకాష్‌లు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈనెల 15వ తేదీన ఫిరంగిపురంలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారు. ఎంపికైన క్రీడాకారులను హెచ్ఎం సీహెచ్ కళ్యాణి, మల్లిఖార్జునరావు, సుధారాణి, ఇన్నారెడ్డి, సిబ్బంది అభినందించారు.

75 వేలకు చేరువలో టీడీపీ సభ్యత్వ నమోదు

పిడుగురాళ్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతమైంది. ఇప్పటికి 4 మండలాల పరిధిలో అన్ని పోలింగ్‌బూత్‌ల ఇన్‌చార్జ్‌లు, పార్టీ ముఖ్యులు సమష్టిగా సభ్యత్వ కార్యక్రమాన్ని పూర్తి చేస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి గురజాల నియోజకవర్గం మొత్తం 75 వేల సభ్యత్వ నమోదు పూర్తయింది. పట్టణంతో పాటు జానపాడు, జూలకల్లు, గుత్తికొండ తదితర గ్రామాల్లో టీడీపీ ముఖ్యులు భాగస్వామ్యమయ్యారు.

జనసేన పార్టీ మండల అధ్యక్షుడిగా కిషోర్



జనసేన పార్టీ దాచేపల్లి మండల అధ్యక్షుడిగా నియామకపత్రం అందుకుంటున్న కిషోర్

దాచేపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ దాచేపల్లి మండల అధ్యక్షుడిగా పెదగార్లపాడు గ్రామానికి చెందిన పాముల కిషోర్ మంగళవారం నియామకపత్రం అందుకున్నారు. గుంటూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు నుంచి నియామకపత్రం అందుకున్నారు. జనసేన పార్టీలో కార్యకర్తగా పని చేస్తున్న తనను మండల స్థాయి అధ్యక్షుడిగా నియమించిన జిల్లా అధ్యక్షుడికి కిషోర్ కృతజ్ఞతలు తెలియజేశారు. మండలంలోని అన్నివర్గాల నాయకులను కలుపుకొని గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు.

స్పెషల్ డ్రైవ్‌తో విద్యుత్ బకాయిలు

విద్యుత్‌శాఖ జిల్లా ఎస్ఈ విజయకుమార్

పిడుగురాళ్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యుత్ వినియోగదారుడు సకాలంలో బిల్లులు చెల్లించాలని పల్నాడు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ డాక్టర్ పత్తిపాటి విజయకుమార్ తెలిపారు. మంగళవారం పిడుగురాళ్ల విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయంలో పిడుగురాళ్ల, దాచేపల్లి డీఈఈ, ఏఈలతో సమావేశం నిర్వహించారు. విద్యుత్ బిల్లుల వసూళ్ల, పెండింగ్ బకాయిలు చెల్లించడంతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అధికారులకు సూచనలు చేశారు. పిడుగురాళ్ల ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఆఫీసును ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో మాచర్ల డీఈ సింగయ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

15న యరపతినేని లక్ష్మయ్య విగ్రహావిష్కరణ

రెంటచింతల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తండ్రి యరపతినేని లక్ష్మయ్య విగ్రహాన్ని ఈనెల 15న మంచికల్లు గ్రామంలో ఆవిష్కరించనున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు. జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

సాగర్ జలాశయంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మాచర్ల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజయపురిసౌత్‌లోని మేకల గొంది సమీపంలోని కృష్ణా జలాశయంలో మంగళవారం ఓ వ్యక్తి మృతదేహం కనిపించడంతో అటుగా పొలాలకు వెళ్తున్న రైతులు గుర్తించి విజయపురిసౌత్ పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ షఫీ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షఫి తెలిపారు. కాగా మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

మాజీ కౌన్సిలర్ మృతి

సత్తెనపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన 5వ వార్డు మాజ కౌన్సిలర్ షేక్ మౌలాలి(70) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని పలువురు టీడీపీ నేతలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గుండెపోటుతో ఉపాధ్యాయిని మృతి

దుర్గి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఉపాధ్యాయిని మృతి చెందింది. దుర్గి గ్రామానికి చెందిన పీ భార్గవి మండలంలోని కంచరగుంట్ల గ్రామంలో మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తోంది. మంగళవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా గుండెనొప్పితో ఆమె మరణించారు. ఆమె మరణంపై ఎస్టీయూ నేతలు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

కాశీ వెళ్లి తిరిగి వస్తూ మహిళ మృతి

పెదకూరపాడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలుసుపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు దాములూరి గోపీ మాతృమూర్తి వరలక్ష్మి కాశీ వెళ్లి దర్శనం చేసుకొని తిరిగి వస్తూ మార్గంమధ్యలో గుండెపోటుతో మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని నియోజకవర్గ టీడీపీ నాయకులు కంచేటి సాయి, క్రోసూరు మాజీ ఎంపీపీ దిగుమర్తి అప్పారావు, మంగళవారం నివాళులర్పించారు.

బెల్టు షాపు నిర్వాహకులపై కేసులు

నకరికల్లు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సోమవారం రాత్రి చేజర్ల, కుంకలగుంట గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారి నుంచి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

భూముల భద్రత బాధ్యత ప్రభుత్వానిదే

- ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ
- పలు మండలాల్లో రెవెన్యూ సదస్సులు
- ప్రజల నుంచి అర్జీల స్వీకరణ



నందిగామలో జరిగిన రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజల, ప్రభుత్వ ఆస్తుల రక్షణకు ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని, ప్రజల భూమికి భద్రత కల్పించే బాధ్యత ప్రభుత్వా నిదేనని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని నందిగామలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. 2019లో జగన్ అధికారంలోకి వచ్చాక ఆయన ముఠా ప్రజల భూములపై పడ్డారన్నారు. భూములు కోల్పోయిన వారికి రెవెన్యూ సదస్సులు అండగా నిలుస్తున్నాయన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. 33 రోజుల పాటు జరిగే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సత్వర పరిష్కారం కోసమే సదస్సులు

● తహసీల్దార్ జే మధుబాబు

పిడుగురాళ్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న పలు రకాల భూసమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ జే మధుబాబు తెలిపారు. మంగళవారం కామేపల్లి, చెన్నాయపాలెం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు తమ భూసమస్యలు, ఆన్‌లైన్ నమోదు, సరిహద్దు, పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం రెవెన్యూ సదస్సులో అందిన దరఖాస్తులకు ఉచితంగా సేవలు అందిస్తారన్నారు.

ఈ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్ శర్మ, ఆర్ఐ శ్రీనుబాబు, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, టీడీపీ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లు, వీఆర్‌వోలు, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

పిల్లుట్లలో 49 అర్జీలు

మాచవరం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 49 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ క్షమారాణి తెలిపారు. పిల్లుట్ల, కొత్తగణేషునిపాడు గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా వచ్చాయి. సదస్సుల్లో ఆయా గ్రామాల సర్పంచులు లము మవరపు శివ పార్వతి సాంబశివరావు, కుందూరి నరసింహారావు, మాజీ సర్పంచ్ చల్లగుండ్ల బిక్షయ్య, మాజీ ఎంపీటీసీ వాహతు సత్యనారాయణరాజు, ఆర్ఐ కోటేశ్వరరావు, సర్వేయర్ సాల్మన్ రాజు, వీఆర్‌వో, ఆయా గ్రామాల రైతులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నది తీరప్రాంత గ్రామాలైన కాట్రపాడు, భట్రుపాలెంలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 18 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వైవీ కుటుంబరావు తెలిపారు. తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా తహసీల్దార్ అధికారులను ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో డీటీ రాజు, ఆర్ఐ శరత్, సర్వేయర్ తదితరులున్నారు.

దుర్గి: మండలపరిధిలోని రాజానగర్‌లో తహసీల్దార్ ఫణీంద్రకుమార్ ఆధ్వర్యాన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వీఆర్వో కిరణ్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గురజాలటౌన్: మండలంలోని తేలుకుట్ల సచివాలయంలో డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యాన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పూర్ణచంద్రరావు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

రెంటచింతల: మండలంలోని జెట్టిపాలెంలో ఇన్‌చార్జి తహసీల్దార్ నగేష్ అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో 9 దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో సరోజని, సహాయ హైడ్రాలజిస్టు, వీఆర్వో పాల్గొన్నారు.

క్రోసూరు: మండలంలోని గుడిపాడు, గాదెవారిపాలెం గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సు ల్లో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. గ్రామాల్లో దశాబ్దాల తరబడి భూములకు సంబంధించిన సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, తగిన రికార్డులతో దరఖాస్తు చేసుకుంటే తక్షణమే పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. వీఆర్వో మస్తాన్‌వలి, గ్రామ సర్వేయర్లు, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట: మండలంలోని గింజుపల్లిలో జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన తహసీల్దార్ పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 15 అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించారు. పొలానికి వెళ్లే దారులు లేకపోవటంతో పాతదారులను పరిశీలించేందుకు సమన్వయ కమిటీ సభ్యుడు పసుపులేటి పాపిరెడ్డి తహసీల్దార్‌ను పొలాల వైపు తీసుకువెళ్లారు. అనంతరం దారి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సదస్సులో అధికారులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు అభినందనీయం

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



క్రీడలను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపటం కోసం గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు ప్రతి ఏటా క్రీడా పోటీలను ఏర్పాటు చేసిన నిర్వాహకులు అభినందనీయులని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడులో జీఆర్‌సీఆర్‌కే స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో చైతన్య హైస్కూల్ గ్రౌండ్‌లో మంగళవారం రాత్రి రాష్ట్ర స్థాయిలో గుత్తా రత్నచంద్ర రామకోటేశ్వరి మెమోరియల్ రాష్ట్ర స్థాయి వాలీబాల్, కబడ్డీ, షటిల్ బాడ్మింటన్ పోటీలను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. చదువుతో పాటు క్రీడలకు కూడా విద్యార్థులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, తల్లిదండ్రులను, విద్య నేర్పిన గురువులను ఎన్నటికీ మరువ కూడదన్నారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీపీఎస్ వర ప్రసాదు, మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, మాజీ ఎంపీపీ బెల్లం కొండ రామ్‌గోపాలరావు తదితరులు ప్రసంగించారు. ఎమ్మెల్యే ప్రవీణ్‌ను నిర్వాహకులు గుత్తా కవిత రాము శాలువాలతో, పూలమాలు, జ్ఞాపికలతో సన్మానించారు.

ఎమ్మెల్యే ప్రవీణ్‌కు ఘన స్వాగతం

రాష్ట్ర స్థాయి వాలీబాల్, కబడ్డీ, షటిల్ బాడ్మింటన్ పోటీల ప్రారంభానికి వచ్చిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు జీఆర్‌సీఆర్‌కే స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వాహకులు కవిత రాము, వారి సిబ్బంది ఘన స్వాగతం పలికారు. పెదకూరపాడులోని వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యే నాలుగు గుర్రాల బండిలో ఆశీనులయ్యారు. చెక్క భజలతో, తీన్‌మార్ వాయిద్యాలతో అంబేద్కర్ సెంటర్ నుంచి క్రీడా పోటీలు నిర్వహించే హైస్కూల్ ప్రాంగణానికి ఘన స్వాగతం పలుకుతూ తీసుకెళ్లారు.

గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధిపై శిక్షణ తరగతులు

క్రోసూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధిపై శిక్షణ తరగతులను మండలపరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో జీ శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. గ్రామ పంచాయతీల స్థాయి అధికారులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఆయా గ్రామాల అభివృద్ధి కోసం, పారిశుధ్య పనుల నిర్వాహణ కోసం గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులు, స్థానిక వనరులు, సౌకర్యాల కల్పన తదితర అంశాలపై శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జ్యోతి వెలిగించి శిక్షణా కార్యక్రమాలు ప్రారంభించి మహాత్మాగాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలదండలు వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ అధికారి మోహన్‌రావు, ఎంపీపీ పెరుమాళ్ళపల్లి కోటయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి శ్యామ్‌సన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

నకరికల్లు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశంపై నకరికల్లు ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ కేవీఎస్ ప్రసాదు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ తస్లిమా, హెచ్ఎస్ బీ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆనందకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు స్థలంలో రహదారి నిర్మాణంపై వివాదం

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అమరావతి నుంచి విజయవాడ వెళ్లే రహదారిలో గల ఎస్సీ బాలుర వసతి గృహం పక్కన ప్రయివేటు వ్యక్తులకు చెందిన సొంత స్థలంలో సీసీ రహదారి నిర్మాణం చేపట్టేందుకు మెటల్ తోలడంతో వివాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే పెద్దిబోయిన అంకమ్మ అనే వ్యక్తి విజయవాడ రహదారి వెంబడి ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహం తూర్పువైపున విన్నకోట గోపయ్యకు చెందిన 16సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశారు. స్థలానికి, వసతి గృహానికి మధ్య 15 లింకుల సొంత భూమిని గోపయ్యకు సంబంధించిన వ్యక్తులు, అంకమ్మ కుటుంబీకులు రాకపోకలు చేసుకోవడానికి రహదారిని వదులుకున్నారు. అయితే ఎస్సీ వసతి గృహం వెనుక ఓ భవనాన్ని బ్యాంకు నిర్వహించిన వేలం పాటలో ఎంపీపీ ఎం హనుమంతరావు కొనుగోలు చేశాడు. ఈ భవనం నుంచి విజయవాడ రహదారి వైపు రావడానికి దారి లేకపోవడంతో అంకమ్మ, గోపయ్యలు వదులుకున్న రహదారిని సీసీ రోడ్డు వేసేందుకు హనుమంతరావు మెటల్ తోలాడు. దీంతో అంకమ్మ కుమారులు అంకమ్మరావు, వలరాజు, కోడలు భాగ్యలక్ష్మి మా స్థలంలో రోడ్డు ఎలా వేస్తారని రహదారి ముందు కాలువలో ఉన్న సిమెంట్ పైపులను తొలగించారు. దీంతో ఎంపీపీ హనుమంతరావు, ఎన్ శ్రీనివాస్ తదితరులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి ఈ విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాల మేరకు సీఐ శ్రీనివాసరావు, ఎంపీడీవో పార్వతీ, సర్పంచ్ రాజేశ్వరీ తమ సిబ్బందితో ఆ ప్రదేశానికి చేరు కుని పైపులను కాలువలో వేయించి పైన మట్టి పోయించారు. రహదారి విషయం అధికారులను వివరణ కోరగా తాము మురుగునీరు వేళ్లే మార్గం సరిచేసేందుకు వచ్చామని తెలిపారు.

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



అమరావతిలో ప్రసంగిస్తున్న సివిల్ జడ్జీ లీలావతి

క్రోసూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని శివసేన పార్టీ రాష్ట్ర నాయకులు వినోదుల నరసింహారావు అన్నారు. మంగళవారం క్రోసూరులో నిర్వహించిన మానవ హక్కుల దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అధికారులు, పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం మానవ హక్కుల పరిరక్షణను బాధ్యతగా భావించాలన్నారు. అట్టడుగు వర్గాల వారి హక్కులకు ఎటువంటి భంగం కలగనీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జీవించే హక్కుకు బలహీన వర్గాల వారు దూరమవుతున్నారని, మానవ హక్కులను కాపాడటంలో పోలీసు వ్యవస్థ ప్రదాన బాధ్యత వహించాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కంచేటి నరసింహారావు, బద్దం వెంకటరెడ్డి, కడియం శివ బాల కోటేశ్వరరావు, నందిగం కోటేశ్వరరావు, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక గుడ్‌షెపర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కోర్టు సివిల్ జడ్జీ లీలావతి ముఖ్యఅతిథిగా పల్గొని ప్రసంగించారు. మానవ హక్కులు జీవించే హక్కుతో ప్రారంభమవుతాయని అన్నారు. జీవించడం అంటే గౌరవప్రదంగా స్వేచ్ఛగా కలసిమెలసి జీవించడం అన్నారు. పల్నాడు జిల్లా బాలల సంరక్షణ అధికారి శౌరీలు మాట్లాడుతూ బాలల హక్కులే మానవ హక్కులని వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో తిరుపతిరావు, సిస్టర్ విన్నారసి, కృష్ణారెడ్డి భారతి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి : బీసీ సంక్షేమాధికారి దయాకర్

రెంటచింతల, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): మార్చిలో జరుగనున్న పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆ ప్రకారం ప్రణాళికలు రూపొందించుకోవాలని మాచర్ల బీసీ సంక్షేమ సహాయ అధికారి ఎం దయాకర్ ఆదేశించారు. మంగళవారం రాత్రి స్థానిక బీసీ బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో సమావేశమయ్యారు. బాలికలకు పలు సూచన లు చేశారు. వార్డెన్ సుశీల తదితరులున్నారు.

రేపు జాబ్ మేళా

సత్తెనపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో గురువారం ఉదయం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా జరుగుతుందని నిర్వాహకులు రామకృష్ణారెడ్డి, అంజిరెడ్డిలు మంగళవారం విలేకరులకు తెలిపారు. నాలుగు కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లమో, ఫార్మసీ, పీజీ చదివిన నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాకు హాజరు కావచ్చన్నారు. వయస్సు 18 నుంచి 40 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. మేళాకు హాజరు కాదలచిన వారు బయోడేటా, స్టడీ సర్టిఫికెట్స్ జిరాక్స్, ఆధార్ నకలు, పాసు పోర్టు సైజు ఫొటోతో హాజరుకావాలన్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు జాబ్‌మేళా జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 8074393466, 9494986164లలో సంప్రదించాలన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

అచ్చంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేల్పూరు ఎస్సీ కాలనీలో యువకులకు స్నేహ హస్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్, నెట్, షటిల్ బ్యాట్‌లు, నెట్‌లు ఇతర క్రీడా సామగ్రి పంపిణీ చేసినట్టు స్నేహ హస్తాల ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ తాయి కరీముల్లా బాబు మంగళవారం తెలిపారు. వేల్పూరు ఎస్సీ కాలనీలో గల పాఠశాల ఉపాధ్యాయుడు గనుపల్లి సునీల్‌బాబు వీటిని అందజేశారు. కాలనీకి సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

టీడీపీ కార్యకర్త సుభాని మృతి

● ఎమ్మెల్యే యరపతినేని సాయం

పిడుగురాళ్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 13వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ షేక్ సుభాని సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. వార్డులో, పట్టణంలో మైనారిటీల ఐక్యత, టీడీపీ అభివృద్ధికి సుభాని ఎన్నికల సమయంలో ఎంతో కృషి చేశాడు. మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యరపతినేని ఫోన్‌లో సుభాని కుటుంబసభ్యులతో మాట్లాడి సంతాపం వ్యక్తం చేసి, రూ.40 వేలు పార్టీ నాయకుల ద్వారా వారికి అందజేశారు.

సుభాని మృతి విషయం తెలుసుకున్న రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జనాబ్ మౌలానా ముస్తాక్ అహ్మద్ పిడుగురాళ్లలో మంగళవారం జరిగిన సుభాని అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రుస్తుంబాబు, అబ్దుల్ సలామ్, జాన్‌వలి, షేక్ బాబావలి, సయ్యద్ అమీర్‌అలి, అబ్దుల్లా హఫీసాబ్, సైదా తదితరులు పాల్గొన్నారు.

రూ 30వేలు ఆర్థిక సాయం అందజేత

సత్తెనపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన ఐనవోలు శ్రీనివాసరావుకు కొత్త రామకృష్ణ మిత్రులు మంగళవారం రూ.30వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. గుంటూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావును పరామర్శించారు. ఆయనతో పాటు ఆర్యవైశ్య యువజన సంఘం నేతలు రామారావు, పసాదు, శ్రీనివాసరావు, సత్యనారాయణ తదితరులున్నారు.

నేడు సత్తెమ్మవారి వద్దకు కన్నా రాక

అచ్చంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదిపాడు అటవీప్రాంతంలో ఉన్న సత్తెమ్మ తల్లి అమ్మవారి ఆలయం వద్దకు మొక్కులు తీర్చుకొనేందుకు బుధవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ రానున్నారు.

ప్రతి ఒక్కరికి క్యాన్సర్ పరీక్షలు చేయాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మావతి

రెంటచింతల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ మహమ్మారిని నిర్మూలించడానికి ప్రతి ఇంటికెళ్లి పరీక్షలు నిర్వహించాలని డీప్యూటి డీఎం హెచ్‌వో డాక్టర్ పద్మావతి ఆదేశించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 18 ఏళ్ల పైబడిన వారికి మధుమేహం, హిమోగ్లోబిన్ పరీక్షలు తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎన్ కృష్ణారెడ్డి, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, సూపర్‌వైజర్లు కోటేశ్వరరావు, లక్ష్మీ ప్రసన్న ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక దేవాలయం నాగార్జున సాగర్ ప్రాజెక్టు

● ప్రాజెక్ట్ గేట్స్ డీఈ మురళీధర్



ప్రాజెక్ట్ శంకుస్థాపన దినోత్సవంలో అధికారులు

మాచర్ల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ ఆధునిక దేవాలయమని ప్రాజెక్ట్ గేట్స్ డీఈ మురళీధర్ అన్నారు. మంగళవారం మండలంలోని విజయపురిసౌత్‌లో ప్రాజెక్ట్ శంకుస్థాపన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకుస్థాపన పిల్లర్, ఫౌండేషన్ స్టోన్ వద్ద మాజీ ప్రధాని నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీఈ మురళీధర్ మాట్లాడుతూ ప్రాజెక్ట్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగి 69 ఏళ్లు పూర్తయిందన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి శ్రమించిన కార్మికులను మనమంతా గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో విజయపురిసౌత్ ఎస్ఐ మహ్మద్ షఫి, సీఆర్పీఎఫ్ సీఐ ఖలీల్, టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, ఏఈఈలు వెంకటసుబ్బయ్య, హిమబిందు, అనితశ్రీ, భారత, ఏఎస్ఐ సోమ్లానాయక్, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు మైలపల్లి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడకు తరలివెళ్లిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు



చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

క్రోసూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కంట్రిబ్యూషన్ పెన్షన్ పథకాన్ని రద్దు చేయటంతో పాటు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎస్ ఉద్యోగులు పిలుపునిచ్చిన చలో విజయవాడ కార్య క్రమానికి క్రోసూరు మండలం నుంచి పెద్దసంఖ్యలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు తరలివెళ్లారు. విజయవాడలోని ధర్నా చౌక్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన క్రోసూరుకు చెందిన సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలూరి పిచ్చయ్య, జిల్లా, రాష్ట్ర అధ్యక్షులు ఒబెదుల్లా బేగ్, పార్థసారథి, ఏపీటీఎఫ్ నాయకులు కృష్ణకిషోర్‌లు ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం ఎన్నో సంవత్సరాలుగా డిమాండ్ చేస్తూ వస్తున్నామని, అనేకసార్లు ధర్నా చేశామని, ప్రభు త్వాల వైపు నుంచి హామీలు తప్ప తమకు ఎటువంటి ప్రయోజనం ఉండటం లేదని అన్నారు. తమ డిమాండ్లు సాధించుకోకుండా కొంత మంది రిటైర్ అయిపోతున్నారని, వారికి తీరని నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వమైనా సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వారు కోరారు. విజయవాడలో జరిగిన ధర్నాకు రాష్ట్రం నలు మూలల నుంచి ఉపాధ్యాయులు, ఉద్యోగులు తరలివచ్చినట్టు వారు తెలిపారు.

కొత్త రకం విత్తనాలు వేసేపుడు జాగ్రత్తలు తీసుకోవాలి

● జిల్లా వ్యవసాయ అధికారి మురళి

క్రోసూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు కొత్త రకం వరి వంగడాలను సాగు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళీ సూచించారు. మంగళవారం అందుకూరులో జరిగిన మాగాణి రైతుల సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామానికి చెందిన జంగా శంకరరావు అనే రైతు నూతన రకం బీపీటీ 3082 వరి వంగడాన్ని సాగు చేస్తున్న సందర్భంగా వ్యవసాయ అధికారులు మంగళవారం ఆయన పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు ఎన్నో కొత్త వంగడాలను సృష్టించి రైతులకు అందుబాటులోకి తీసుకు రావ టం వల్లనే ఆహార ధాన్యాల ఉత్పత్తిలో మన దేశం ముందంజలో ఉందన్నా రు. రైతులు కొత్త రకాలను సాగు చేసే సమయంలో కొద్ది విస్తీర్ణంలో పం టను వేసి దిగుబడిని పరిశీలించిన తరువాతనే ఎక్కువ విస్తీర్ణంలో పంట వేసుకోవాలన్నారు. వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త కృష్ణవేణి మాట్లాడుతూ బీపీటీ 3082 కొత్త రకం విత్తనం పురుగులు, తెగుళ్ళను తట్టుకుంటుందని, పది నుంచి 15 శాతం వరకు అధిక దిగుబడిని ఇస్తుందని, ప్రకృతి వైపరీత్యాలకు పంట పడిపోవటం కాని ఉండదని, పంట కాలం కేవలం 135 రోజులేనని తెలిపారు. ఈ రకం విత్తనం వేస్తే ఎరువుల వినియోగం కూడా తక్కువగా ఉండటంతో పాటు ఖరీఫ్, రబీ పంటల కాలాలకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ వరి వంగడాన్ని బాపట్ల రైతు శిక్షణా సంస్థ వారు రూపొందించినట్టు చెప్పారు. కార్యక్రమంలో క్రోసూరు ఏడీఏ వీ హనుమంతరావు, ఏవో వీ వేణుగోపాల్, రైతు సేవాకేంద్రం సిబ్బంది సీహెచ్ లక్ష్మి, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో రైతులకు లాభాలు

● శాస్త్రవేత్త ఏ రాధికరమ్య

నకరికల్లు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులు ఉద్యాన పంటలను సాగు చేయటం ద్వారా లాభాలు పొందే అవకాశం ఎక్కు వగా ఉందని ఉద్యాన శాస్త్రవేత్త ఏ రాధికరమ్య తెలిపారు. మంగళవారం నకరికల్లు మండలం చేజర్ల, కుంకలగుంట, రైతు సేవాకేంద్రాల్లో ఉద్యానశాఖ ద్వారా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ విజిట బుల్ అండ్ స్పైసెస్ అనుసంధానమైన గ్రామాల్లో రైతులకు మిరప పంటలో శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మిరప పంటలో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి తెలిపారు. సమగ్ర పోషక యాజమాన్యం, సస్యరక్షణ చర్యల గురించి రైతులకు తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో వచ్చే లాభాల గురించి వివరించారు. ఉద్యాన పంటలకు ప్రభుత్వం నుంచి రైతులకు అందించే సబ్సిడీల గురించి జిల్లా ఉద్యాన శాఖ అధికారి దాసరి నవీన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు ఆత్మహత్యాయత్నం

మాచర్లటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో హోం గార్డు ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. మం డలంలోని విజయపురిసౌత్ పోలీస్‌స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తు న్న షేక్ షరీఫ్ మంగళవారం మాచర్ల పట్టణానికి చేరుకున్నారు. సాయం త్రం వేళలో పత్తిప్యాక్టరీకి వెళ్లే రహదారిలో తనతో తెచ్చుకున్న పురుగుమందును తాగుతుండగా స్థానికులు వారించి పురుగుమందును డబ్బాను లాగేసి అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకొని హోంగార్డు షరీఫ్‌ను పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. కాగా ఈ విషయంపై పోలీస్‌స్టేషన్లో ఎటువంటి కేసు నమోదు కాలేదు. ఆత్మహత్యయత్నంకు గల కారణాలు తెలియరాలేదు.

భవనంపై నుంచి పడి పెయింటర్‌కు తీవ్ర గాయాలు

మాచర్ల రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భవనంపై నుంచి పడి పెయింటర్‌కు గాయాలైన సంఘటన మండలంలోని కొప్పునూరులో జరిగిం ది. పట్టణంలోని 31వ వార్డుకు చెందిన పెయింటర్ పాముల సాగర్‌బాబు మంగళవారం మండలంలోని కొప్పునూరులో నూతనంగా నిర్మించిన భవనానికి పెయింట్ వేసేందుకు వెళ్లాడు. రెండో అంతస్థులో పెయింట్ వేస్తుండగా పరంజాకు కట్టిన తాడు జారిపోవడంతో కిందపడిపోయాడు. గాయపడిన సాగర్‌బాబును మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటకు తరలించారు.

డంపింగ్ యార్డుల రహితంగా రాష్ట్రం

- పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పీ నారాయణ
- త్వరలో మరో ఐదు జిల్లాల్లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు
- పల్నాడు జిల్లాలోని జిందాల్ ప్లాంట్ పరిశీలన



వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ వింటున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే పుల్లారావు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): వ్యర్థాల సమర్థ నిర్వహణ ద్వారా వచ్చే ఏడాది గాంధీ జయంతి (అక్టోబరు 2) నాటికి డంపింగ్ యార్డులు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు పంచాయతీలో జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ని మంత్రి నారాయణ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో కాకినాడ, నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపురంలలో కూడా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 2014-19 మధ్యలో ఘన వ్యర్థాల నిర్వహణపై వివిధ రాష్ట్రాలు, దేశాల్లో అధ్యయనం చేసి, ఉత్తమ విధానాలతో రాష్ట్రంలో 10 ప్రాంతాల్లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. అందులో భాగంగా గుంటూరు, విశాఖపట్నం జిల్లాల్లో ప్లాంట్ల నిర్మాణ పనులు వేగంగా చేపట్టామన్నారు.

వైసీపీ అసమర్థ నిర్వహణ ...

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యర్థాల అసమర్థ నిర్వహణ వల్ల రాష్ట్రంలో 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త నిల్వలు పేరుకుపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన అనతి కాలంలోనే ఆ వ్యర్థాలను శుభ్రం చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా, విశాఖలోని జిందాల్ ప్లాంట్లలో 2,160 టన్నుల వ్యర్థాలను(31 శాతం) ట్రీట్మెంట్ చేస్తున్నారని తెలిపారు. ఆ ప్లాంట్ల ఏర్పాటుతో 50 నుంచి 60 కిలోమీటర్ల పరిధిలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ, నగర పంచాయతీల్లో వ్యర్థాల సమర్థ నిర్వహణకు మార్గం సుగమమైందన్నారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, తాగునీరు, రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా వ్యర్థాల ద్వారా గంటకు 15 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తూ, రోజుకి 12 వందల టన్నుల వ్యర్థాలను ప్రాసెసింగ్ చేసే జిందాల్ ప్లాంట్ ఏర్పాటు సీఎం చంద్రబాబు దార్శనికతకు తార్కాణమన్నారు. కార్యక్రమంలో మంత్రితో పాటు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, ఎండీ అనిల్‌కుమార్‌రెడ్డి, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, జిందాల్ ఏపీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) ఎంవీ చారి పాల్గొన్నారు.

శిథిలావస్థలో సంక్షేమ భవన



పెచ్చులూడుతున్న శ్లాబ్.. పడిపోతున్న గోడలు.. ఇనుప చువ్వలు బయట పడి ప్రమాద స్థితిలో ఉన్న పిల్లర్స్.. పగుళ్ళతో ఎప్పుడు కూలుతుందో తెలియని కారిడార్.. ఇదీ జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్ దుస్థితి. జిల్లా పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న సంక్షేమ భవన్‌లో సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ శాఖల కార్యాలయాలు, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ కార్యాలయాలు ఉన్నాయి. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా ఈ భవనం కనీస మరమ్మతులకు సైతం నోచుకోలేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఒక పక్క అధికారులు, సిబ్బంది, మరోపక్క ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- పెచ్చులూడుతున్న శ్లాబ్.. మొదటి అంతస్తు ఖాళీ
- ఇప్పటికే కొన్ని కార్యాలయాలు ప్రైవేటు భవనాల్లోకి...
- ఐదేళ్ళల్లో పైసా ఇవ్వని వైసీపీ ప్రభుత్వం

గుంటూరు(విద్య), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు నగరంలోని జీటీ రోడ్డు నుంచి కలెక్టరేట్ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో జిల్లా పరిషత్ కార్యాలయంలో వెనుక దాదాపు ఐదు దశాబ్దాల క్రితం సంక్షేమ భవన్ కార్యాలయాలను నిర్మించారు. గడిచిన కాలంలో సంక్షేమ భవన్ నిర్మాణాలు పూర్తిగా శిథిలమవుతూ ఉన్నాయి. ప్రస్తుతం మరింత ప్రమాదకరంగానూ మారాయి. కార్యాలయాల నిర్వహణ సరిగా లేకపోవడంతో మొదటి అంతస్తు స్లాబ్ పెచ్చులుగా ఊడిపోవడం, గోడలకు పగుళ్ళ వచ్చాయి. దీంతో అక్కడ బీసీ కార్పొరేషన్, ఇంజనీరింగ్ విభాగం, రెసిడెన్షియల్ స్కూల్ సొసైటీ కార్యాలయాలను ప్రైవేటు భవనాల్లోకి తరలించారు. ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని మాత్రం ఇదే భవనంలో ఉన్న సమావేశ మందిరంలో కొనసాగిస్తున్నారు.

అద్దెల కట్టలేక శిథిల భవనంలోనే...

సంక్షేమభవన్‌లో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూనే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ ఉద్యోగుల కోసం కనీసం మరుగుదొడ్లు కూడా లేవు. దీంతో కార్యాలయాలకు ప్రవేటు భవనాల కోసం వేట ప్రారంభించారు. నగరంలో ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలను అద్దెకి ఇవ్వడానికి ప్రైవేటు వ్యక్తులు ముందుకు రాని పరిస్థితి ఉంది. చివరకు ఎట్టకేలకు ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని బ్రాడీపేటలోని ఒక ప్రైవేటు భవనంలోకి మార్చారు. అక్కడ నెలనెల అద్దెలు భరించలేక కార్యాలయం ఆవరణలో ఉన్న సమావేశ మందిరంలోకి తిరిగి వచ్చేశారు. సాంఘిక శాఖ సంక్షేమ శాఖ, బీసీ సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు బయట అద్దెలు భరించలేక ఈ శిథిల భవనాల్లోనే కార్యాలయాలు కొనసాగిస్తున్నామని పేరుచెప్పని ఓ అధికారి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంక్షేమ భవన్ కార్యాలయాలకు కొత్త భవనాలను నిర్మించడమా? లేక ఉన్న భవనాలకు మరమ్మతులు చేయించడమా? అనే విషయాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.





బీసీ కార్పొరేషన్ చాంబర్ వద్ద పెచ్చులూడుతున్న స్లాబ్



ఖాళీ అయిన ఇంజనీరింగ్, బీసీ కార్పొరేషన్ ఈడీ చాంబర్స్

మరమ్మతుల గురించి పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం

రాష్ట్రం ఉమ్మడిగా ఉన్నప్పుడు, టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవన్‌లో కార్యాలయాలకు కార్పొరేట్ హంగులు కల్పించారు. ప్రత్యేక చాంబర్లు, సిటింగ్ కోసం ఆధునిక కుర్చీలు, కంప్యూటర్ డెస్కులు, అధికారుల గదులకు ప్రత్యేక సిలింగ్‌తో కూడిన నిర్మాణాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో కార్పొరేట్ హంగులతో తయారైన తొలి భవనం ఇదే. అయితే గడిచిన అయిదేళ్ళలో సంక్షేమ భవనంలోని కార్యాలయాలు మరింత ప్రమాదకరంగా మారాయి. ప్రస్తుతం కొన్ని చాంబర్స్‌లోకి వర్షపు నీరు వస్తోందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

45 రకాల జబ్బులకు 'బాల సురక్ష'లో ఉచిత వైద్యం

- ఆరోగ్యరక్ష వాహనం ప్రారంభించిన కలెక్టర్ నాగలక్ష్మీ
- సేవలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు



వాహనం ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మీ

గుంటూరు మెడికల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నవజాత శిశువుల నుంచి 18 ఏళ్లలోపు బాల బాలికల్లో కనిపించే పలు రకాల రుగ్మతలను ముందుగానే గుర్తించి తగిన చికిత్సలు అందించేందుకు రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో (ఆర్‌బీఎస్‌కే) అమలు చేస్తున్నట్లు గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మీ తెలిపారు. రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో భాగంగా స్క్రీనింగ్ చేసి తదుపరి చికిత్సల సిఫార్సు చేసిన పిల్లలను గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలోని జిల్లా సత్వర చికిత్స కేంద్రానికి చేరవేసేందుకు ప్రభుత్వం కేటాయించిన బాలల సంపూర్ణ ఆరోగ్యరక్ష వాహనాన్ని మంగళవారం కలెక్టరేట్‌లో జెండా ఊపి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మీ మాట్లాడుతూ శిశువులు, పిల్లల్లో 45 రకాల జబ్బులను గుర్తించి జిల్లా సత్వర చికిత్సకేంద్రంలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. క్లబ్‌ఫుట్ (వంకర పాదాలు), క్యాటరాక్ట్, వినికిడి లోపాలు, గ్రహణం మొర్రి, నాడీవ్యవస్థ లోపాలు, రక్తహీనత, పోషకాహార లోపం, చర్మ వ్యాధులు, గుండె వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు, మూర్ఛ వంటి పలు రకాల జబ్బులకు జిల్లా సత్వర చికిత్సకేంద్రంలో ఉచితంగా వైద్యసేవలు లభిస్తాయని వెల్లడించారు. ఈసేవలను అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మీ కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మీ, రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జయరామకృష్ణ, డీఐవో డాక్టర్ ఏ శ్రావణ్‌బాబు, జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ లక్ష్మానాయక్, డెమో ఏ జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రేవుల్లో ఇష్టారాజ్యం



- రౌడీల బెదిరింపు.. పాటదారుడు పరారీ
- అంబడిపూడి, మల్లాది రీచ్‌ల్లో విజిలెన్స్ తనిఖీలు
- 9 జేసీబీలు, 3 లారీలు, 360 టన్నుల ఇసుక స్వాధీనం

గుంటూరు సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇసుక రేవుల్లో పాటదారుడు లేడు.. అయితే స్థానికంగా చక్రం తిప్పే వ్యక్తులు.. వారు నియమించిన రౌడీ మూకలదే రాజ్యం. రౌడీల దెబ్బకు పాటదారుడు ఎప్పుడో పరారయ్యాడు. ఇసుక తవ్వకాలు జరిపేదంతా రౌడీమూకలే. అనుమతి లేకుండా.. నిబంధనలకు పూర్తిగా నీళ్లొదిలి.. భారీ యంత్రాలతో నదీ గర్భంలో ఇసుకను తవ్వి తీసి జేబులు నింపుకుంటున్నారు. అచ్చంపేట మండలం అంబడిపూడి, అమరావతి మండలం మల్లాది రీచ్‌ల్లోకి బయట వాళ్లను రానిచ్చే పరిస్థితి లేదని కొన్ని చోట్ల యువకులను కాపలా పెట్టి మరీ ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని ప్రభుత్వానికి, విజిలెన్స్ డీజీకి ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మంగళవారం విజిలెన్స్, మైనింగ్ అధికారులు పరిశీలించి అక్కడ పరిస్థితిని చూసి ముక్కున వేలేసుకున్నారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎస్పీ సూర్యశ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో సీఐలు కొమ్మలపాటి చంద్రశేఖర్, పీ శివాజీ, మైనింగ్, రెవెన్యూ అధికారులు తనిఖీలు చేశారు. అంబడిపూడి, మల్లాది రీచ్‌ల్లో గ్రీన్‌ట్రిబ్యునల్ ఆదేశాలు ఉల్లంఘించినట్లు అధికారులు గుర్తించారు. నదీ గర్భంలోకి వెళ్లి ఇసుకను తవ్వి తీస్తున్నారని, జేసీబీ, ఎక్స్‌కవేటర్లను వినియోగిస్తున్నారని అధికారులు గుర్తించారు. లారీలను నదిలోకి తీసుకువెళ్తున్నారని తేల్చారు. ఈ క్రమంలో రీచ్‌ల్లో 9 జేసీబీ, ఎక్స్‌కవేటర్లు, మూడు లారీలు, 360 టన్నులు ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. అచ్చంపేట, అమరావతి పోలీసు స్టేషన్లలో విజిలెన్స్ అధికారులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా క్రిమినల్ కేసు లు నమోదు చేస్తామని చెప్పారు.

విజయవాడ వ్యక్తి...?

అంబడిపూడి, మల్లాది రీచ్‌ల్లో జరుగుతున్న ఇసుక దందా అంతా విజయవాడకు చెందిన వ్యక్తి చుట్టూ తిరుగుతుంది. అసలు ఆ వ్యక్తికి ప్రభుత్వ అనుమతి ఉందా.. లేదా అన్న విషయం తేల్చడం మైనింగ్ అధికారుల వల్ల కూడా కాలేదు. మైనింగ్ శాఖ రికార్డుల ప్రకారం ఆయా రీచ్‌ల్లో ఎవరికీ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. అనుమతులు ఉన్నట్లుగానే భారీ యంత్రాలతో ఇసుకను తవ్వుతున్నారు. అధికారుల రాకను గమనించి ఇసుక తవ్వి స్తున్న వాళ్ళు పరారయ్యారు. అధికారులు ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అక్కడే ఉన్నా ఏ ఒక్కరు కూడా వచ్చి తమకు అనుమతి ఉందని వచ్చి చెప్పలేదని సమాచారం. అప్పటి నుంచి ఎంత మేరకు ఇసుక తవ్వి తీశారో అధికారులు లెక్కలు వేయిస్తున్నారు.



అంబడిపూడి ఇసుక రీచ్ లో భారీ యంత్రాలను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ ఎస్పీ డీ సూర్య శ్రావణ్ కుమార్

కొనుగోళ్లకు.. కొర్రీలు

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం పేర్కొంది. అయితే ఆర్.ఎస్.కెలు పరీక్షించినా మిల్లర్లు ససేమిరా అంటున్నారు. ఆ శాతాలను పరిగణనలోకి తీసుకోకుండా మళ్లీ సొంతగా తేమ పరీక్షిస్తున్నారు. ఆర్.ఎస్.కెలో నిర్ధారించిన దానికంటే కొన్ని మిల్లుల్లో 3 నుంచి 5 శాతం అదనంగా చూపిస్తున్నారు. తేమ పరీక్షించే పరికరంలో కప్పు కొలత మేరకే పొయ్యాల్సి ఉంటే, అంతకుమించి పొయడంతో తేమ శాతం కూడా అదనంగా చూపిస్తోంది. దీంతో అదనంగా వచ్చిన తేమకు సరిపడా తరుగు కింద తీసేస్తున్నారు. మళ్లీ పరీక్షలపై రైతులు ప్రశ్నిస్తుంటే బస్తాకు రూ. 50 నుంచి రూ.100 తీసుకుని ఆర్.ఎస్.కేల్లో అడిగినంత తక్కువ తేమ శాతం వేసిస్తున్నారని, అందుకే తాము పరిశీలించుకుంటున్నామని మిల్లర్లు దబాయిస్తున్నారు. తేమ శాతం ఒక్కో పాయింట్‌కు రూ.20 చొప్పున ధరలో కోత విధిస్తున్నారు. వరి నూర్పిళ్ల యంత్రాలతో చేస్తున్నందున తేమ శాతం ఎక్కువగా ఉంటున్నది. తేమ శాతం ప్రభుత్వం చెబుతున్నట్టు 17 శాతమే ఉండాలంటే 10 నుంచి 15 రోజులు ఆరబెట్టాలి. చేలల్లో ధాన్యం ఆరబెట్టే పరిస్థితులు లేవు. పొలం నుంచి ధాన్యాన్ని కేంద్రానికి తీసుకు రావడానికి బస్తాకు రూ.100 ఖర్చు అధికంగా అవుతున్నది. 40 కిలోల గోతానికి రూ.3.39 ధరను అధికారులు నిర్ణయించారు. అయితే ఈ ధరకు గోతం కొనే పరిస్థితి లేదు. 75 కిలోల గోతం ధర రూ.20 నుంచి 30 వరకు ఉంది. హమాలీ కూలీ క్వింటాకు రూ.25గా నిర్ణయించారు. రవాణా చార్జీలు స్థానికంగా ఎక్కడికక్కడ నిర్ణయించనున్నారు. అయితే ఇవేవీ అమలు కావడంలేదు. దీంతో రైతులు అయినకాడిక అమ్మేసుకుంటున్నారు. రాబోయే రెండు మూడు వారాల్లోనే లక్ష్యం వరకు వచ్చే అవకాశాలు కనబడుతున్నాయి. ఆ తర్వాత ఏమిటన్న దానిపై అధికారుల్లో స్పష్టత కొరవడింది. సరైన ప్రణాళికలు లేని కారణంగానే ధాన్యం సేకరణ విషయంలో రైతులు అగచాట్లు పడుతున్నారు. గతంలో మిల్లరు ధాన్యం సేకరణ కోసం పోటీ పడేవారు. ఈ దఫా ప్రభుత్వం తేమ శాతం నిబంధనల విషయంలో సడలింపులు ఇవ్వడంతో భవిష్యత్తులో సీఎంఆర్ విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయని భావిస్తున్న మిల్లర్లు తాము బ్యాంకు గ్యారెంటీ ఇచ్చిన మేరకు సేకరించి మిన్నకుండిపోతున్నారని సమాచారం.



బ్యాంక్ గ్యారెంటీ అయిపోయిందంటూ..

రైతు వాట్సాప్ ద్వారా స్లాట్ బుక్ లేదా ఆర్.ఎస్.కెలకు వెళ్లి ధాన్యం తేమ శాతాన్ని పరీక్షించి మిల్లు అనుమతి తీసుకోవాలి. అయితే మిల్లులు రైతుల నుంచి ధాన్యం కొనాలంటే వాటికి బ్యాంక్ గ్యారెంటీ అవసరం ఉంటుంది. తుపాన్ సమయంలో భారీగా ధాన్యం కొనుగోలుతో చాలా మిల్లులకు బ్యాంకులకు గ్యారెంటీ పరిమితి దాటిపోయింది. కొనుగోళ్లకు ఇబ్బందులు రాకుండా మిల్లులకు 1:1 నిష్పత్తిలో కాకుండా 1:2 నిష్పత్తిలో కూడా ప్రభుత్వం అనుమతులిచ్చింది. అయితే ఈ అవకాశాన్ని వారు రైతులకు వినియోగించకుండా దళారుల నుంచి ధాన్యాన్ని కొనడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. మిల్లులకు బ్యాంక్ గ్యారెంటీ అయిపోయిందని, రెండు రోజుల్లో వస్తుందని, వచ్చాకే ధాన్యం కొనగలమని చెప్తున్న మిల్లర్లు దళారుల నుంచి మాత్రం లారీలకు లారీల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు.

బాపట్ల జిల్లాకు ఇన్‌చార్జి అధికారే దిక్కు..

జిల్లాలో కీలకమైన ధాన్యం సేకరణ జరుగుతున్న సమయంలో సివిల్ సప్లయిస్ డీఎంగా పౌరసరఫరాలశాఖ అధికారే ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ధాన్యం సేకరణ సమయంలో డీఎంను కలెక్టర్ సరెండర్ చేశారు. ప్రత్యామ్నాయం కింద డీఎస్‌వోకే ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో ఏ విషయంలోనూ ఫలితాలు చూపించలేని పరిస్థితి నెలకొంది. గతంలో డిసెంబరు మూడో వారంలో ధాన్యం చేతికొచ్చేది. కానీ ఈ సారి దాదాపు ఈ నెల మొదటి వారంలో నూర్పిళ్లు మొదలైనా కొనుగోళ్లకు సన్నద్ధతలో వ్యవసాయశాఖ వైఫల్యం స్పష్టంగా కనబడింది. తుఫాన్ ప్రభావంతో వర్షాలతో కల్లాల్లో ధాన్యం తడవడం వంటివన్నీ అన్నదాతలను వెంటాడడంతో వారు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

ఇప్పటి వరకు 28,000 మెట్రిక్ టన్నుల ధాన్యం అన్నదాతల చేతికి రాగా మద్దతు ధరకు సేకరించింది కేవలం 5,800 మెట్రిక్ టన్నులే. దాదాపుగా 15,000 టన్నుల ధాన్యం దళారుల పరమైంది. సేకరణ లక్ష్యాన్ని 50,000 టన్నులుగానే నిర్ధేశించుకున్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ విజేత కృష్ణవేణి డిగ్రీ కళాశాల



విజేతల జట్టుకి ట్రోఫీ అందజేస్తున్న ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్ తదితరులు

గుంటూరు(విద్య),డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): చౌడవరంలోని ఆర్వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న వర్సిటీ అంతర కళాశాల వాలీబాల్ టోర్నమెంట్ (మెన్) మంగళవారం ముగిసింది. మంగళవారం జరిగిన ఫైనల్స్‌లో నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల జట్ల మధ్య సాగిన పోటీలో నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు మొదటి స్థానంలో నిలిచి విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల జట్టు ద్వితీయ స్థానం, తృతీయ స్థానంలో వర్సిటీ కాలేజీ అఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు, నాల్గొవ స్థానంలో ధనలక్ష్మి కాలేజీ అఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్టు నిలిచాయి. ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను వర్సిటీ వాలీబాల్ (మెన్) జట్టులోకి తీసుకుంటారు. త్వరలో కేరళ యూనివర్సిటీలో జరగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీస్ వాలీబాల్ (మెన్) టోర్నమెంట్‌లో వర్సిటీ జట్టు పాల్గొంటుందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ టోర్నమెంట్ పరిశీలకులు డాక్టర్ సూర్యనారాయణ, సెలక్షన్ కమిటీ మెంబెర్స్ పాతూరి శ్రీనివాస్, జే. ప్రేమ్ కుమార్, టోర్నమెంట్ ఆర్గనైజర్ సెక్రటరీ డా.పి.గౌరీ శంకర్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎమ్. శివ రామకృష్ణ తెలిపారు. విజేతలను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

19, 26 తేదీల్లో శబరిమలకు అదనపు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ఈ నెల 19, 26 తేదీల్లో అదనపు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్ఎం ఎం రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07175 సికింద్రాబాద్ - కొల్లం ప్రత్యేక రైలు ఈ నెల 19, 26 (గురువారం) తేదీల్లో రాత్రి 8 గంటలకు బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, చీరాల మీదగా శుక్రవారం అర్ధరాత్రి దాటాక 1.30కి కొల్లం చేరుకొంటుంది. నంబరు. 07176 కొల్లం - సికింద్రాబాద్ రైలు ఈ నెల 21, 28 తేదీల్లో (శనివారం) వేకువ జామున 5 గంటలకు బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం 1.30కి సికింద్రాబాద్ చేరుకొంటుందన్నారు.

మిర్చి రైతులను ఆదుకోండి



- పంటకు కనీస మద్దతు ధర కల్పించండి
- కేంద్ర మంత్రులు పీయూష్, శివరాజ్‌సింగ్‌కు డాక్టర్ పెమ్మసాని వినతి

గుంటూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలోని మిర్చి రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌కు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. స్పైసెస్ బోర్డ్ అఫ్ ఇండియాలో మిర్చి విభాగం ఏర్పాటు చేయాలని కోరారు. పెరుగుతున్న పెట్టుబడులు, చీడపీడల బెడద, మార్కెటింగ్ మౌలిక సదుపాయాలు లేకపోవడంతో మిర్చి రైతుల జీవనోపాధి అగమ్యగోచరంగా మారిందన్నారు. ఈ మేరకు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు మంగళవారం పెమ్మసాని లేఖ రాశారు. మిర్చి బోర్డు ఏర్పాటు ద్వారా చీడపీడల నివారణ, ఎగుమతి సౌకర్యాలు, ఆధునిక ప్రాసెసింగ్ వంటి కీలక రంగాలపై ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉందన్నారు. మిర్చికి కనీస మద్దతు ధర కల్పించాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి పెమ్మసాని విజ్ఞప్తి చేశారు. మిర్చి ఎకరా సాగు సగటు వ్యయం 2.50 లక్షలకు చేరిందని, 2022-23 నుంచి మిర్చి ధరలు 50 శాతం పడిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని, కనీస మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. కౌలు రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

బీసీ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి: ఎంపీడీవో

నూజెండ్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీసీ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో పీ ఉమాదేవి అన్నారు. మంగళవారం బీసీ హాస్టల్‌ను తనిఖీ చేసి ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రవిచంద్ర, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

22న పెన్షనర్లకు సన్మానం

నరసరావుపేట టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కార్యాలయంలో ఈ నెల 22న 75 సంవత్సరాలు నిండిన వారికి సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని సంఘం కార్యదర్శి సీసీ ఆదెయ్య మంగళవారం తెలిపారు. 1948 డిసెంబరు 18 నుంచి 1949 డిసెంబరు 17 వరకు ఈ మధ్యకాలంలో జన్మించిన 75 సంవత్సరాలు నిండిన గౌరవ సంఘ సభ్యులకు సంఘం అధ్యక్షుడు మానం సుబ్బారావు అధ్యక్షతన సత్కార కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు డీ వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ జీ ప్రభుదాస్, రాష్ట్ర కోశాధికారి టీవీఎస్ఎస్ఆర్‌పీ శర్మ, సెక్రటరీ రామకృష్ణారావు హాజరవుతారన్నారు. సంఘ సభ్యులు, సన్మాన గ్రహీతలు, శ్రేయోభిలాషులు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేయాలన్నారు.

జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి ఎంపిక


వై.మధుకిషోర్

నరసరావుపేట టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎన్ కళాశాలకు చెందిన వై మధుకిషోర్ జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ మంగళవారం తెలిపారు. ఈ నెల 7, 8 తేదీలలో విశాఖపట్నం బీచ్‌రోడ్‌లోని ఆక్వాస్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన రాష్ట్రస్థాయి శీతాకాలపు సబ్-జూనియర్, జూనియర్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీలలో 200మీటర్ల బటర్‌ఫ్లై ఈవెంట్‌లో పాల్గొని బంగారుపతకం సాధించి ఈ ఘనత సాధించారన్నారు. ఈ నెల 20న విజయవాడలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో వై.మధుకిషోర్ పాల్గొంటారన్నారు. మధుకిషోర్‌ను కళాశాల పాలకవర్గం, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

స్మార్ట్ మీటర్లు తొలగించాలి: కాసా

నరసరావుపేట టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలంలో ప్రభుత్వం బిగించిన స్మార్ట్ మీటర్లు తొలగించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం నరసరావుపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాసా రాంబాబు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా సామాన్య ప్రజలపై భారాలు మోపుతోందని అన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు తొలగించాలని తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

షాపుల తొలగింపు వద్దు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి ప్రజలు చేసుకునే వ్యాపారాల జోలికి మున్సిపల్ అధికారులు వెళ్లొద్దని మైనారిటీ హక్కుల పరిరక్షణా సమితి రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్ మంగళవారం హెచ్చరించారు. కుటుంబాల పోషణ కోసం అద్దెలు చెల్లించలేని వారు ఫుట్‌పాత్‌ల మీద, ప్రభుత్వ స్థలాలలో పన్నులు చెల్లిస్తూ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. అధికారులు స్పందించకుంటే బాధితులతో మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తానని హెచ్చరించారు.

పశుగణన తనిఖీ

రొంపిచర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పర్లపల్లి, వడ్లమూడివారిపాలెం, ముత్తనపల్లి, సుబ్బయ్యపాలెం, విప్పర్ల గ్రామాల్లోని పశుగణన కార్యక్రమాన్ని జిల్లా యానిమల్ హజ్‌బెండరీ అధికారి కే కాంతారావు మంగళవారం పరిశీలించారు. గత నెల నవంబరు 1 నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకు ఈ కార్యక్రమం జరగనుంది. ఆయా గ్రామాల్లో పశువుల యజమానులతో ఆయన మాట్లాడారు. అదేవిధంగా మినీ గోకులాలను పరిశీలించారు. త్వరితగతిన పశుగణన కార్యక్రమాన్ని పూర్తిచేయాలని, వైద్యాధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట పశు వైద్యులు వంశీ ప్రసాదు, శ్రీకాంత్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి: మండల సమాఖ్య ఏపీఎం వాసుబాబు

శావల్యాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలున్నాయని, బాల్య వివాహాలను అరికట్టడం ప్రజలందరి కర్తవ్యమని శావల్యాపురం మండల సమాఖ్య ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు అన్నారు. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయస్థాయిలో జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు మండల సమాఖ్య ఆధ్వర్యంలో శావల్యాపురం సెంటర్‌లో మంగళవారం ర్యాలీని నిర్వహించారు. అధికారులు, మహిళలు ప్రతిజ్ఞ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుప్పం శ్రీలత మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో పురుషులకు సమానంగా రాణించాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు గోనుగుంట్ల ప్రసన్న, సెక్రటరీ కుమారి, సీసీ ఖాజా, అంగన్‌వాడీ టీచర్లు గోపమ్మ, ఎస్తేరురాణి, జెస్సికా పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటను పరిశీలించిన ఏవో

రొంపిచర్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పర్లపల్లి వడ్లమూడివారిపాలెం గ్రామాల్లో మొక్క జొన్న పొలాలను ఏవో శివలలిత మంగళవారం పరిశీలించారు. పంటలో వచ్చే తెగుళ్ళ గురించి నివారణ గురించి రైతులకు వివరించారు.

మూతపడిన ఆర్వో ప్లాంట్లు

- నిర్వహణ వ్యయభారంతో మూత
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- విద్యుత్ బకాయిలు చెల్లించి ప్లాంట్లను పునరుద్ధరించాలని వినతి


నీలగంగవరంలో మూతపడిన ఆర్వోప్లాంట్

వినుకొండ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ప్రజల దాహార్తిని దృష్టిలో ఉంచుకొని లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఆర్వో ప్లాంట్లు వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో ఫ్లోరైడ్ సమస్యను పారదోలేందుకు నాటి పాలకులు లక్షల రూపాయలు వెచ్చించి ఆర్వో ప్లాంట్లు ఏర్పాటుచేశారు. గ్రామాల్లో ప్లాంట్ల నిర్వహణకు రూ.5లకే మినరల్ వాటర్‌ను విక్రయించి ప్లాంట్ నిర్వహణ బాధ్యతలను స్థానికులకు అప్పగించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ బిల్లులు చెల్లించక సర్పంచ్‌లు పట్టించుకోకపోవటంతో నియోజకవర్గంలోని ఆర్వో ప్లాంట్లన్నీ నిరుపయోగంగా మారాయి. బొల్లాపల్లి మండలంలోని అయ్యన్నపాలెం, ఈపూరు మండలంలోని కొండ్రముట్ల, ఇనిమెళ్ళ, చిట్టాపురం, నూజెండ్ల మండలంలోని మృత్యుంజాపురం, చింతలచెర్వు, పమిడిపాడు, వి.అప్పాపురం, వినుకొండ మండలంలోని నీలగంగవరం, చెట్టుపల్లి, పిట్టంబండ్లతోపాటు శావల్యాపురం మండలంలో వేల్పూరు తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉండడంతో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటుచేశారు. వైసీపీ పాలనలో ఆర్వో ప్లాంట్లపై శ్రద్ధ చూపకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ప్లాంట్ల వద్ద ఏర్పాటుచేసిన నీటిబోర్లను కొందరు స్వార్థపరులు ఆక్రమించుకున్నారు.. ఇదిలా ఉండగా వినుకొండ పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని ఎస్ఎస్‌పీ కాలనీ, విష్ణుకుండినగర్ కాల్వ కట్ట వద్ద ఆర్వో ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా గ్రామాలతోపాటు, పట్టణాల్లోని తాగునీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని నిరుపయోగంగా మారిన ఆర్వో ప్లాంట్‌ను పునఃరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులో రైతుల ఫిర్యాదులు

- పలు సమస్యలను పరిష్కరించిన రెవెన్యూ అధికారులు


రెవెన్యూ సదస్సులో ఫిర్యాదులు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

వినుకొండ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరుమాళ్ళపల్లి, మదమంచిపాడు దేవాలయంలో మండల ప్రత్యేక అధికారి శ్రీరాములు ఆధ్వర్యంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పెరుమాళ్ళపల్లిలో మొత్తం 8 సమస్యలను రైతులు సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం మదమంచిపాడు దేవాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులు ఐదు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంతో సానుకూల సమస్యలపై వెంటనే అక్కడికక్కడే పరిష్కరించారు. దేవాలయానికి వచ్చే రహదారికి పట్టా భూమి నుంచి దారిఇచ్చామని, గతంలో దేవాలయ రహదారి కోసం ఏర్పాటుచేసిన పోరంబోకు భూమిని రైతులకు అప్పజెప్పాలని జంగాలపల్లికి చెందిన పలువురు రైతులు సభ దృష్టికి తీసుకువచ్చారు. రైతుల ఫిర్యాదు మేరకు సంఘటన ప్రాంతాన్ని పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి త్వరలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఏనుగుపాలెం గ్రామానికి చెందిన 90సంవత్సరాల వృద్ధుడు కుమారుడు మృతిచెందడంతో తమ పేరిట ఉన్న ఆస్తిని కాజేసేందుకు కుటుంబ సభ్యులు కుట్రలు పన్నుతున్నారని తన ప్రాణానికి ప్రమాదం పొంచి ఉందని మీరే కాపాడలంటూ రెవిన్యూ అధికారులకు మొరపెట్టుకున్నారు. సమస్యపై స్పందించిన ప్రత్యేక అధికారి శ్రీరాములు వినుకొండ సీఐ శోభనబాబుకు సమాచారం అందించి వృద్ధుడికి రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఆర్ఐ శ్రీహరి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

- కనమర్లపూడి (శావల్యాపురం): రాష్ట్రవ్యాప్తంగా నెలకొని ఉన్న భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి రైతులకు శాశ్వత భూ హక్కును కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గ్రామసభలను నిర్వహిస్తుందని మండల తహసీల్దార్ సుజాత అన్నారు. మండలంలోని కనమర్లపూడి గ్రామంలో రెవెన్యూ గ్రామసభను మంగళవారం నిర్వహించారు. భూ సమస్యలను పరిష్కారించాలని కోరుతూ రైతులు 19మంది గ్రామసభలో దరఖాస్తులు చేసుకొన్నారు. మండల ప్రత్యేకాధికారి మూలె వెంకటరెడ్డి మాట్లాడుతూ రీ సర్వేలో జరిగిన తప్పులను, రైతుల మధ్య భూ వివాదాలను పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని, రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీనియర్ నేతలు గోరింట్ల హనుమంతరావు, ముక్కపాటి నాగేశ్వరరావు, రీసర్వే డీటీ నాసరయ్య, మండల సర్వేయర్ రాజు, వీఆర్వోలు రమాదేవి, నరసింహారావు, విలేజ్ సర్వేయర్ హరికృష్ణ పాల్గొన్నారు.
- బొల్లాపల్లి: మండలంలోని కనమలచెరువులో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన రెవెన్యూ సదస్సు మంగళవారం కనమలచెరువు గ్రామ సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఏ సుధాకర్ మాట్లాడుతూ పొలాలకు సంబంధించి సమస్యలు ఏమైనా ఉంటే అర్జీల రూపంలో అందజేయాలని, అర్జీ ఇచ్చిన వారికి 33 రోజుల్లో సమస్యను పరిష్కరించటం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో ఏర్పాటుచేసే రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరసింహారావు, వీఆర్వో రవి నాయక్, మండల సర్వేయర్ డానియేలు, బాబు తదితరులు పాల్గొన్నారు.
- నూజెండ్ల: మండలంలోని జంగాపల్లిలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభకు 38 దరఖాస్తులు అందినట్టు తహసీల్దార్ జీ రమేష్ కుమార్ తెలిపారు. మ్యుటేషన్‌లు, సర్వేకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను పరిష్కారానికి సూచనలు చేశామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ చండీరాణి, వీఆర్వో యోగయ్య, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్‌డీ రబ్బానీ తదితరులు పాల్గొన్నారు.



శివయ్యస్థూపం సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

వినుకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26వ తేదీన సీపీఐ వందరోజుల ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతీవరప్రసాద్ తెలిపారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీలోని వివిధ విభాగాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ స్వాతంత్ర్య పోరాటంలో, నిరుపేద హక్కుల కోసం నిరంతరం పోరాటాలుచేసి ఎన్నో విజయాలు సాధించిన ఘనత సీపీఐకే దక్కిందన్నారు. ఈ నెల 26వ తేదీన జరిగే ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పార్టీ కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. అదేవిధంగా రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు డిమాండ్స్ డే కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో అదానీ కంపెనీలు చేసిన స్మార్ట్ మీటర్లు, సాయిబాబా ఏజెన్సీలతో ఒప్పందాలు రద్దు చేయాలని, రాష్ట్రంలో ప్రజలపై పెంచిన 15వేల కోట్ల రూపాయల కరెంటు ట్రూఅప్ చార్జీలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక శివయ్య స్థూపం వద్ద ఆ పార్టీ కార్యకర్తలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు పౌష్టికాహారం పంపిణీ

వినుకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు షేక్ అక్బర్ బాషా ఆధ్వర్యంలో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు న్యూట్రిషన్ ఫుడ్‌ను ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రజాక్, మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోసు చేతులమీదుగా మంగళవారం పంపిణీచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రజాక్ మాట్లడుతూ హెచ్ఐవీ ప్రాణాంతక వ్యాధికాదని, వ్యాధి గుర్తించిన వెంటనే వైద్యులు సూచనలు మేరకు మందులు వాడినట్లయితే ప్రమాదం ఉండదని తెలిపారు. అనంతరం న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీచేసిన అక్బర్‌బాషాను ఈ సందర్భంగా అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చికెన్‌బాబు, సుబాని, కె.సుభాని, బిస్కెట్ వలితోపాటు వైద్యవలంటీర్లు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

నూజెండ్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవరం ఎంపీపీ స్కూల్‌లో మంగళవారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఘంటా నాగేశ్వరరావు మాట్లాడుతూ బాలల హక్కులు, అభివృద్ధి చెందే హక్కు, జీవించే హక్కు ఇవన్నీ జీవించే హక్కులకు విఘాతం కలిగినప్పుడు మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదుచేసి హక్కులు సాధించుకోవచ్చన్నారు.

ఈపూరులో పంట కోత ప్రయోగం

ఈపూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈపూరులో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటకోత ప్రయోగం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ బీ రవిబాబు మాట్లాడుతూ పంట సాగుచేసిన రైతులకు ప్రభుత్వం సాధారణ వరికి క్వింటాకు రూ.2,300లు, ఏ గ్రేడ్ రకాలకు క్వింటాకు రూ.2,320లు మద్దతు ధర ఇస్తుందన్నారు. రైతులందరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 17శాతం తక్కువఉండేలా రైతు ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యంను విక్రయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు బీ అప్పారావు, కే కిశోర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎం.శేషుబాబు, సీహెచ్ శ్రీను పాల్గొన్నారు.

ఆర్.కృష్ణయ్యకు బీసీ సంఘం నాయకుల అభినందన


బీజేపీ రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న ఆర్‌కృష్ణయ్యను అభినందిస్తున్న వెంకటకోటయ్యయాదవ్, బీసీ నాయకులు

వినుకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నూతనంగా రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ఆర్ కృష్ణయ్యను జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు మద్దుల వెంకటకోటయ్యయాదవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో నామినేషన్ వేసిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్యను కలిసిన వారిలో చిలకలూరిపేట నియోజకవర్గ అధ్యక్షుడు మాదాసు పృథ్వీరాజ్ సాయి, వీరనారాయణ, సాయితేజతోపాటు బీసీ నాయకులు అభినందనలు తెలిపారు.

ప్రజారక్షణకు పాటుపడే పోలీస్ సిబ్బందికి అండగా ఉంటాం

- పల్నాడు జిల్లా అదనపు ఎస్పీ జేవీ సంతోష్

నరసరావుపేట లీగల్, డిసెంబరు 10: నిరంతరం ప్రజా రక్షణకు పాటుపడే పోలీస్ సిబ్బందికి అండగా ఉంటామని పల్నాడు జిల్లా అదుపు పోలీస్ సూపరింటెండెంట్ జేవీ సంతోష్ మంగళవారం తెలిపారు. సర్వీస్‌లో ఉంటూ మరణించిన పోలీస్ కానిస్టేబుల్ కుటుంబాలకు పోలీస్ శాఖ తరఫున ఆర్థికసాయం చెక్కును ఆయన కుటుంబాలకు మంగళవారం అందజేశారు. ఈ ఏడాది అక్టోబరు 10న పల్నాడు జిల్లా ఏఆర్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ గుండెపోటుకు గురై మరణించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎన్ వెంకటేశ్వర్లు భార్య ఎల్లమ్మకు లక్ష రూపాయల చెక్కును ఏఎస్పీ అందజేశారు. ఈ ఏడాది అక్టోబరు 30న పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా సేవలందిస్తూ గుండెపోటుతో మరణించిన సందపోగు శ్యాంప్రసాద్ భార్య నిర్మలదేవికి పోలీస్ అసోసియేషన్ ద్వారా చేయూత పథకం కింద లక్ష రూపాయల చెక్కును అందచేశారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సత్తిరాజు జిల్లా పోలీస్ కార్యాలయం ఏవో కేవీడీ రామారావు పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు టి మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- మండల ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి

శావల్యాపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పథంలో తీర్చిదిద్ది పేదప్రజల జీవనోపాధులను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తుందని మండల ప్రత్యేకాధికారి మూలె వెంకటరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో రాష్ట్రీయ గ్రామస్వరాజ్ అభియాన్ నిధులతో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి, భారత ప్రభుత్వం నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను 2030నాటికి పూర్తయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈవోపీఆర్డీ సుగుణ, ఏపీఎం వాసుబాబు, ఏపీవో రామారావు, సూపర్‌వైజర్లు శ్రీలత, ఏడుకొండలు పాల్గొన్నారు.

కంది పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి: ఏవో

వినుకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిగడ్డ, దొండపాడు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి అంజిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కంది, వరి, మిరప పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించి పంటలో అధిక దిగుబడి సాధించేందుకు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఏ రామకృష్ణ, ఆంజనేయులు, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డాక్టర్ అంజిరెడ్డి వైద్యశాలలో అరుదైన శస్త్ర చికిత్స

నరసరావుపేట లీగల్, డిసెంబరు 10: పట్టణంలోని డాక్టర్ అంజిరెడ్డి వైద్యశాలలో అరుదైన శస్త్ర చికిత్సను నిర్వహించినట్లు డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వైద్యశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో తొలిసారిగా పెరిఫెరల్ యాంజియో ప్లాస్టి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. పట్టణానికి చెందిన శ్రీనివాసరావు నియంత్రణ లేని మధుమేహం తదితర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారన్నారు. సమస్య తీవ్రమై కాలు తొలగించే పరిస్థితి రావడంతో డాక్టర్ అంజిరెడ్డి వైద్యశాలను సంప్రదించారన్నారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ కోట శబరి గిరీష్ పర్యవేక్షణలో కాలు రక్తనాళాలలో స్టంట్లను అమర్చి అంగవైకల్యం కలగకుండా కాపాడినట్లు తెలిపారు.

రేపు డయల్ యువర్ డీఎం

చిలకలూరిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చిలకలూరిపేట ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ ఎస్.రాంబాబు మంగళవారం తెలిపారు. డిపో పరిధిలో ఉన్న నాదెండ్ల, యడ్లపాడు, చిలకలూరిపేట మండలాల ప్రజలు ఆర్టీసీ సేవలకు సంబంధించి తమ సూచనలు, సలహాలు ఫోన్ నెంబర్ 99592 25427 కు ఇవ్వవలసినదిగా ఆయన కోరారు.

వరి పంట బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి: డీడీఏ

చిలకలూరిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం యడవల్లి, కట్టుబడివారిపాలెం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పల్నాడు జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎం.నగేష్, ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ జనరల్ మేనేజర్ లింగయ్య పాల్గొని మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో వరి పంటను బీమాకు ఎంపిక చేయడం జరిగిందని, రబీలో వరి పంట వేసే రైతు ఎకరానికి రూ.630 ప్రీమియం కట్టడం వలన అకాల వర్షాలు, వరదలు వలన బీమా ద్వారా కాపాడుకోవచ్చునని తెలిపారు. నష్టం జరిగిన పంటకు బీమా వర్తిస్తుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిరపలో నల్ల తామర, మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ చర్యల గురించి కూడా వివరించారు. మండల వ్యవసాయాధికారి టి శ్రీలత, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమస్యల పై సీఎంకు ప్రత్తిపాటి వినతి


సమస్యలపై సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గంలోని అభివృద్ధి పనులు గురించిన పలు వినతి పత్రాలు, పెండింగ్ సమస్యల్లో ప్రాధాన్యంగా చేపట్టాల్సిన పనులు, ముఖ్యంగా చిలకలూరిపేట వంద పడకల ఆస్పత్రికి అవసరమైన సిబ్బంది, పరికరాల ఏర్పాటు, అత్యాధునిక వసతులకు నిధులు, ఆటోనగర్ అభివృద్ధికి నిధులు, పేదల వైద్య చికిత్సల కోసం సీఎం సహాయ నిధి నుంచి ఉదారంగా సాయం చేయాలని సీఎం చంద్రబాబుకు ప్రత్తిపాటి విజ్ఞప్తి చేశారు. మంగళవారం సచివాలయంలో సీఎం చంద్రబాబును ప్రత్తిపాటి మర్యాద పూర్వకంగా కలసి వివిధ అంశాలపై చర్చించి ఈ మేరకు వినతి పత్రాలు అందజేశారు. ప్రత్తిపాటి వినతిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరితగతిన మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు.


జీవీ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి

వినుకొండ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తామని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో యూటీఎఫ్ నాయకులు మంగళవారం జీవీని కలిసి సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ మెరుగైన విద్యావ్యవస్థ కోసం ప్రభుత్వం ప్రయత్నాలు ప్రయత్నిస్తోందని, పూర్తి సహాయ సహకారాలు ఉండాలని కోరారు. అనంతరం యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ పాఠశాలల పనివేళలు పెంపు, టీచర్లపై యాప్‌ల భారం తగ్గించాలని, సెలవులపై ఆంక్షలు ఎత్తివేయాలని కోరారు. సమస్యలపై జీవీ స్పందించి విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇవ్వడంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రవికుమార్, అజయ్‌బాబుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం


వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఎంవీ రెడ్డి

వినుకొండ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జాషువా కళా ప్రాంగణ ఆవరణలో జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యదర్శి నిశ్శంకర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోసు పాల్గొని కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. నరసరావుపేటకు చెందిన కంటి వైద్య నిపుణులు ఎంవీ రెడ్డి సారథ్యంలో సుమారు 423మందికి కంటి వైద్యశిబిరం నిర్వహించి కంటి సమస్యలు ఉన్నవారికి కళ్ళద్దాలు మందులు పంపిణీచేశారు. 52 మందికి శుక్లాలు, 18మందికి కంటిలో పొరలు ఉన్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

రైతుల్ని మోసం చేసిన చంద్రబాబు ప్రభుత్వం: గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్, డిసెంబరు 10: రైతుల్ని రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని, వ్యవసాయ శాఖ మంత్రి ఎక్కడున్నారో ఎవరికీ తెలియదు మాజీ శాసన సభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు రైతులకు 20 వేలరూపాయలు ఇస్తామని ప్రకటించి ఇంతవరకు ఇవ్వకపోవడం బాధాకరం అన్నారు. డిసెంబరు 13వ తేదీ ఉదయం 10గంటలకు వైసీపీ కార్యకర్తలు, నాయకులు, రైతులతో కలిసి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి, రైతులని ఆదుకోవాలని వినతిపత్రం ఇస్తామన్నారు.


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, గైడ్ టీచర్ శ్రీనివాసరావు

రాష్ట్రస్థాయి కళోత్సవ్‌లో వేల్పూరు విద్యార్థుల ప్రతిభ

వేల్పూరు (శావల్యాపురం) డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ అండ్ రీసెర్చ్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో విజయవాడలోని మురళి రీసార్ట్స్‌లో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కళోత్సవ్ పోటీల్లో శావల్యాపురం మండలం వేల్పూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శననిచ్చి ద్వితీయస్థానంలో నిలిచినట్లు పాఠశాల హెచ్ఎం మహబూబ్ సుభానీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి 13జిల్లాలకు ఆరు విభాగాల్లో పోటీలు నిర్వహించగా జానపద నృత్యం, ముఖాభినయం పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా తరఫున పాల్గొన్న వేల్పూరు జడ్పీ పాఠశాల విద్యార్థులు కె.నాగరోషిని, కె.మస్తాన్‌బీ, ఆర్.శ్రావణి, ఈ.తులసి, టి.అక్షయ జానపదనృత్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాను రాష్ట్రంలో ద్వితీయస్థానంలో నిలిపారన్నారు. ద్వితీయస్థానంలో నిలిచిన విద్యార్థులను ఏపీఈఆర్టీ డైరెక్టర్ ఘనంగా అభినందించి ప్రశంసాపత్రాలు, మెమొంటోలను అందజేశారు. విద్యార్థులకు ప్రేరణనిచ్చిన గైడ్ టీచర్ జ్యోతి శ్రీనివాసరావును ఎస్ఎంసీ చైర్మన్ దన్నవరపు శ్రీనివాసరావు, హెచ్ఎం మహబూబ్ సుభానీ, వివేకానంద పూర్వవిద్యార్థుల కమిటీ అధ్యక్షుడు ఎస్.చలపతిరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు కొండ్రముట్లలో కోదండరామస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ

కొండ్రముట్ల (ఈపూరు) డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11వ తేదీన మండలంలోని కొండ్రముట్లలో కోదండరామస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. నూతనంగా సుబ్రమణ్యస్వామి, గజపతి, దాసాంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ధ్వజస్తంభానికి ఇత్తడి తొడుగు ఏర్పాటుచేశారు. ఐదున్నర దశాబ్దాల నాడు నిర్మించిన ఆలయం పల్లంలో ఉండడంతో గ్రామస్థులు చందాలు వేసుకొని ఆలయ పునఃనిర్మాణం చేసి రంగులు వేశారు.


కమ్మవారిపాలెం ఎస్టీ కాలనీలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమాదేవి

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపీడీవో

నూజెండ్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపాలెం ఎస్టీ కాలనీలో పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరైన నిధులతో నిర్మిస్తున్న సీసీ డ్రెయిన్ పనులను ఎంపీడీవో పీ ఉమాదేవి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్టీ కాలనీ వాసులకు మెరుగైన వసతులు కల్పించేందుకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఆంజనేయరాజు, టెక్నికల్ అసిస్టెంట్‌లు సతీష్, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.